ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

శనివారం 1 నవంబరు 2025

భూ రికార్డుల్లో ఆక్రమణదారుల పేర్లు తొలగింపు

పిడుగురాళ్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పల్నాడులో భూ ఆక్రమణలపై విచారణ ఎప్పుడో.. అనే శీర్షికన జూలై 22న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. విచారణ చేపట్టిన ఆర్డీవో మురళీకృష్ణ కోనంకిలో 43 మంది 44.19 ఎకరాల ప్రభుత్వ భూమిని, పిడుగురాళ్లలో ఏడుగురు 6.17 ఎకరాలకు సంబంధించి రికార్డుల్లో అక్రమంగా పేర్లు నమోదును తేల్చారు. డీకే పట్టాలు, పట్టాదారు పాస్‌పుస్తకాలు, రిజిస్టర్ దస్త్రావేజులు, మరే ఇతర పత్రాలు లేకుండానే రెవెన్యూ రికార్డులో పేర్లు నమోదు చేసుకోవడంతో వారికి నోటీసులు జారీ చేశారు. అలా నమోదైన వ్యక్తుల పేర్లను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ రికార్డులో నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ మధుబాబు తెలిపారు.

ఉబికి వస్తున్న కన్నీరు



మగ్గాల గుంతల్లోకి ఉబికి వచ్చిన ఊటనీరు..

ఎలా బతకాలో అర్థం కావడం లేదు

వర్షాల వల్ల నాలుగు నెలలుగా పని చేయలేకపోతున్నాం. నెలకు రూ.5వేల పని కూడా సాగడం లేదు. దీంతో అప్పులు చేయాల్సి వస్తోంది. తుపానుతో మొత్తం పరిస్థితి తలకిందులైంది. ఏం చేయాలో పాలు పోవడం లేదు.



వెంకటేశ్వర్లు, తోటవారిపాలెం

ప్రభుత్వం ఆదుకోకపోతే కష్టమే

తుపాను కారణంగా మగ్గం గుంతల్లోకి నీరు చేరింది. ఆ నీరు ఇంకడానికి కనీసం రెండు, మూడు నెలలు పడుతుంది. ఇప్పటికే నాలుగు నెలలుగా పనులు లేవు. ఇంకో మూడు నెలలు పనులుండవు. పడుగు, పేకలు పాడైపోతాయి. ప్రభుత్వం సాయం చేయకపోతే బతకడం కూడా కష్టమే.

- అవ్వారు కుమార్, చంద్రమౌళి నగర్



- నిండా మునిగిన నేతన్న!
- వర్షాలకు ఆగిన మగ్గం
- ఊటెక్కిన మగ్గం గుంతలు
- పనులు లేక పస్తులతో జీవనం
- మొంథా తుపానుతో మరింత దిగజారిన వైనం
- ప్రభుత్వ చేయూత కోసం నేతన్నల చూపు

సత్తెనపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కిందటి నెల కురిసిన వర్షాలకు ఆగిన మగ్గం మొంథా తుపాను ధాటికి మరో నెలరోజుల వరకూ కదిలే పరిస్థితి లేకుండా పోయింది. రెక్కాడితేగానీ డొక్కాడని నేతన్నల బతుకులు కకావికలమయ్యాయి. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు పీకల్లోతు కష్టాల్లో మునిగిపోయిన చేనేత కార్మికులను మొంథా తుపాను పూర్తిగా ముంచేసింది.



25 వేల కుటుంబాలపై ప్రభావం

చేనేత మనుగడ సాగించాలంటే వాతావరణం సమతుల్యంగా ఉండాలి. ఎండలు మండినా, వానలు కురిసినా చేమగ్గం ఆగిపోతుంది. ఈ ఏడాది వర్షాల తాకిడికి (మిగతా 8వ పేజీలో)

ఉపాధి లేక..అప్పుల పాలు

ఇప్పటికే నెలల తరబడి పనులు కోల్పోయి అల్లాడుతున్న చేనేత కార్మికులకు తుపాను దెబ్బ శరాఘాతంగా పరిణమించింది. కనీస ఆదాయం కూడా పొందలేని సగటు చేనేత కుటుంబాలు కొంత కాలంగా అర్ధాకలితో అల్లాడుతున్నాయి. అప్పులపాలవుతున్నాయి. ఈ పరిస్థితి నుంచి నేతన్నలు బయటపడాలంటే ప్రభుత్వం నుంచి వారికి సహాయం అందాలి. లేదంటే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉంది.

జాతీయ ఐక్యతకు పటేల్ పునాది

- నివాళులు అర్పించిన కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉక్కు మనిషి సర్దార్ వల్లభ బాయ్ పటేల్ జాతీయ ఐక్యతకు పునాది వేశారని కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చిన పటేల్ ఉక్కు మనిషి అని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో చంద్రకళ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ కృతికాశుక్లా, డీఈవో ఎల్ చంద్రకళ

జన్‌మన్ ఇళ్లు పూర్తి చేయాలి

నరసరావుపేట: జిల్లాలో చెంచుల నివాస ప్రాంతాల్లో ప్రధాన మంత్రి జన్‌మన్ పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలు మూడు నెలల్లో పూర్తి చేయాలని కలెక్టర్ కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణ పురోగతిపై కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఎంఏవై గ్రామీణ్ 2.0 సర్వేను నవంబరులోగా పూర్తి చేయాలన్నారు. పీఎం ఆవాస్ అర్బన్, గ్రామీణ్, జన్‌మన్ పథకాల కింద వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న 25,057 ఇళ్లకు 5,486 ఇళ్ల నిర్మాణాలు గణతంత్ర దినోత్సవం నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలన్నారు. మూడు పథకాల కింద మొత్తం 50,174 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 25,117 ఇళ్లు నిర్మించామని అధికారులు తెలిపారు. జన్‌మన్ పథకం కింద 708 ఇళ్లు మంజూరు కాగా 324 నిర్మాణాలు పూర్తయ్యాయని, 384 వివిధ దశల్లో ఉన్నాయని హౌసింగ్ అధికారులు తెలిపారు. సమావేశంలో హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ శివలింగం, ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

కష్టాల.. కాలనీ



పిచ్చిగడ్డితో రహదారి ఇలా..

- ఎన్టీఆర్‌కాలనీలో వసతులు కరువు
- ఏడాదైనా అమలు కాని మంత్రి పార్థసారథి హామీ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రోడ్లు.. తాగునీరు.. డ్రెయిన్లు లేక.. రాత్రిళ్లు విష సర్పాల సంచారాల మధ్య బిక్కు బిక్కుమంటూ నరసరావుపేట ఉప్పలపాడు వద్ద ఉన్న ఎన్టీఆర్‌కాలనీ వాసులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కనీస వసతులు కరువై కాలనీ వాసులను కష్టాలు వెంటాడుతున్నాయి. 1,500 కుటుంబాలకుపైగా కాలనీ లో నివసిస్తున్నాయి. అయితే ఇళ్లకు ఒక్క విద్యుత్ సరఫరా మినహా మిగిలిన వసతులు కల్పించలేదు. దీంతో వర్షాలు పడితే కాలనీలోని రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. తాగునీటిని కొనుగోలు చేసుకోవాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. డ్రెయిన్లు లేక మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. దీంతో దోమలు, అపరిశుభ్రతతో కాలనీవాసులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళలో విషసర్పాల సంచారంతో కాలనీవాసులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయాందోళనలకు గురవుతున్నారు. కనీస వసతులు కల్పించాలని కాలనీ వాసులు కోరుతున్నా వారి మొర ఆలకించే వారేకరువయ్యారు.

నిధులు కొరతని నిర్లక్ష్యం..

ఏడాది క్రితం మంత్రి కొలుసు పార్థసారథి కాలనీలో పర్యటించి స్థానికుల ఇక్కట్లను ప్రత్యక్షంగా చూశారు. ఈ సమయంలో తాగు నీటి వసతి కల్పనతో పాటు రోడ్లు, మురుగు కాల్వలు నిర్మిస్తామని నివాసితులకు మంత్రి హామీ ఇచ్చారు. అయితే ఏడాది కావస్తున్నా మంత్రి ఇచ్చిన హామీలు అమలుకు నోచు కోలేదు. నిధుల కొరత అంటూ సౌకర్యాల కల్పనపై గృహనిర్మాణశాఖ చేతులెత్తేసింది. కాలనీకి మున్సిపాల్టీ తాగునీటి పైపులైను నిర్మించాల్సి ఉన్నా నిధులు లేవని పట్టించు కోలేదు. ఈ పరిస్థితుల్లో కాలనీవాసుల కష్టాలు ఇప్పట్లో తీరేలా లేవు.



వరద ప్రవాహానికి కోతకు గురైన కాలనీ ప్రధాన రహదారి



బురదమయంగా ఎన్‌టీఆర్ కాలనీ వీధులు



గోతుల మయంగా కాలనీ ప్రధాన రహదారి



దైదలో కార్తీక.. ఏర్పాట్లు

భక్తులకు అమరలింగేశ్వరాలయం ఆహ్వానం

పిడుగురాళ్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసపు వేళ నదీ స్నానాలు, ప్రత్యేక పూజలకు కృష్ణానదీ తీరంలోని దైద అమరలింగేశ్వరాలయం భక్తులకు ఆహ్వానం పలుకుతోంది. దైద, పొందుగ లలోని శైవక్షేత్రాలను సందర్శించే భక్తులకు స్నానం ఆచరించేందుకు నదీ తీరంలో ప్రత్యేకంగా ఘాట్లను అందుబాటులోకి తెచ్చారు. కార్తీక మాసానికి ముందే ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అమరలింగేశ్వరాలయ ప్రాంతాలను శుభ్రపరిచారు. గురజాల సమీపంలోని అమరలింగేశ్వరస్వామి క్షేత్రాన్ని కార్తీక మాసంలో అటు తెలంగాణ, ఇటు పల్నాడు, గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో ముఖ్యంగా మహిళా భక్తులు సందర్శిస్తుంటారు. దీంతో మహిళలు నదీ స్నానాలకు, దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేకంగా సౌకర్యాలను ఏర్పాటు చేశారు. కృష్ణా పుష్కరాల సమయంలో ఘాట్ల ఏర్పాటుతో పాటు పలు సౌకర్యాలను ఏర్పాటు చేయగా గత ఐదేళ్ల వైసీపీ హయాంలో వాటిని నిర్లక్ష్యం చేశారు. దీంతో ఘాట్లు అధ్వానంగా మారగా మళ్లీ ప్రస్తుతం వాటికి మరమ్మతులు చేసి, శుభ్రం చేశారు. దైద అమరలింగేశ్వరస్వామి దేవాలయం, గుత్తికొండ బిళం, పొందుగల వద్ద భక్తులు కార్తీకమాస పూజలు, స్నానం ఆచరించేందుకు వీలుగా ఆయా పరిసర ప్రాంతాలన్నీ పరిశుభ్రం చేయడంతో పాటు భక్తులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పించాలన్న ఎమ్మెల్యే యరపతినేని ఆదేశాలతో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.



దేవాలయం స్నానపు ఘాట్



కొనుగోళ్లు.. ఇప్పుడే కాదు

- సీసీఐ కేంద్రాల ప్రారంభంలో జాప్యం
- 7 కేంద్రాలకు 10 జిన్నింగ్ మిల్లుల కేటాయింపు
- వర్షాలతో తేమ నిబంధన సడలించాలని రైతుల వినతి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సీసీఐ కొనుగోళ్ల కేంద్రాలను ఇప్పట్లో ప్రారంభించేలా లేదు. జిల్లాలో ఏడు కేంద్రాలను ప్రకటించిన సీసీఐ వాటికి పది జిన్నింగ్ మిల్లులను కేటాయించింది. ఇక కొనుగోళ్లే తరువాయి అని రైతులు ఎదురుచూస్తున్నారు. అయితే వారిని నిరాశ పరిచేలా కొనుగోళ్ల ప్రారంభానికి మరో 10 నుంచి 15 రోజులు సమయం పట్టవచ్చని సీసీఐ అధికారులు చెబుతున్నారు. తడిచిన పత్తిని ఆరబెట్టి తేమ శాతం తగ్గించుకోవాలని రైతులకు సూచిస్తున్నారు. జిల్లాలో గత ఏడాది కంటే పత్తి సాగు గణనీయంగా 2,27,180 ఎకరాలకు పెరిగింది. అధిక వర్షాలు పత్తిపై తీవ్ర ప్రభావం చూపాయి. ఈ తరుణంలో అంతంత మాత్రం దిగుబడి అయ్యే పత్తి కొనుగోలుకు తేమ శాతంలో నిబంధనలు సడలించాలని రైతులు కోరుతున్నారు. మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో వేసవిలో రైతులు పత్తి సాగు చేశారు. సదరు రైతులు ఇప్పటికే పత్తి రెండు విడతలు తీశారు. పత్తి నిల్వలు రైతుల ఇళ్లల్లో ఉన్నాయి. ప్రైవేట్ మార్కెట్‌లో పత్తి ధర తక్కువగా ఉండటంతో వారు సీసీఐ కేంద్రాల కోసం ఎదురు చూస్తున్నారు. ఒకవైపు వర్షాలు.. మరోవైపు పత్తి కొనుగోళ్లలో జాప్యంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జిన్నింగ్ మిల్లులు ఇలా..

జిల్లాలో సీసీఐ ఏడు పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సీసీఐ అధికారులు శుక్రవారం తెలిపారు. నరసరావుపేట కేంద్ర పరిధిలోని లక్ష్మీగణపతి, శ్రీనాగలక్ష్మి, తిరుమల జిన్నింగ్ మిల్లులను కేటాయించారు. పిడుగురాళ్ల కేంద్రానికి అమరలింగేశ్వర, నడికూడి కేంద్రానికి లక్ష్మీగణపతి, ఉమామహేశ్వర, మాచర్ల కేంద్రానికి శ్రీలక్ష్మీనరసింహ, చిలకలూరిపేట కేంద్రానికి శ్రీవెంకటకృష్ణ, విజయదుర్గా, క్రోసూరు కేంద్రానికి శ్రీవెంకటరమణ జిన్నింగ్ మిల్లులు కేటాయించారు. అయితే తొలుత రైతులు ఆయా కేంద్రాలకు పత్తి తీసుకెళ్లే ముందు స్లాట్ నమోదు చేసుకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు.

రైతులపై భారం..

గతంలో మార్కెట్ యార్డుల్లో సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి పత్తి కొనుగోలు చేసేవారు. మూడేళ్ల నుంచి రైతులు వారికి కేటాయించిన జిన్నింగ్ మిల్లులకు పత్తి తీసుకువెళ్లి విక్రయించేలా నూతన విధానాన్ని రూపొందించి అమలు చేస్తున్నారు. అయితే ఈ విధానంలో రైతులపై రవాణా చార్జీల భారం పడుతోంది. యార్డులోనే పత్తి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నా వారి మొర ఆలకించే ప్రజాప్రతినిధులు, అధికారులు కరువయ్యారన్న విమర్శలు న్నాయి.



- రొంపిచర్లలో పడిపోయిన మిర్చిని బాగు చేస్తున్న రైతు

వీడని ముంపు

- మూడు రోజులుగా నీటిలోనే పొలాలు
- పంటలను కాపాడుకునే యత్నాల్లో రైతులు
- క్షేత్రస్థాయిలో నష్టం నమోదు ప్రక్రియ ప్రారంభం
- పరిహారానికి అడ్డంకిగా సాంకేతిక సమస్యలు

(మాచర్ల, ఆంధ్రజ్యోతి): అనేక ఒడిదుడుకులను అధిగమించి సాగు చేసిన పంటలను మొంథా తుఫాన్ ముంచేసింది. చేతికి అందే దశలో భారీ వర్షాలు.. రైతుల ఆశలను చిదిమేశాయి. తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో పొలాలు ముంపునకు గురయ్యాయి. గురు, శుక్రవారాల్లో ఎండ తీవ్రంగా కాసింది. అయితే పొలాలను ముంపు వీడలేదు. మూడు రోజులుగా నీటిలోనే పంటలు నానుతున్నాయి. చెరువులను తలపిస్తోన్న పొలాలను చూసి రైతులు బోరుమంటున్నారు. వీడని ముంపుతో అంతోఇంతో పంట చేతికి వస్తుందని ఉన్న మిణుకుమిణుకు ఆశలు కూడా ప్రస్తుతం ఆవిరయ్యాయని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. రైతన్నకు వచ్చిన పెను కష్టానికి మొంథా విపత్తు ఓ కారణమైతే వ్యవస్థల నిర్లక్ష్యం మరో కారణంగా కనిపిస్తోంది. తుఫాన్ తీవ్రత తగ్గి మూడు రోజులైనా ఇంకా పొలాలు తటాకాలను తలపించడం వెనుక అనేక కాల్వలకు గండ్లు పడడమే కారణంగా నిలిచింది. పంట కాల్వలతో పాటు డ్రెయినేజీల్లో తూటుకాడ, గుర్రపుడెక్క తొలగించే పనుల విషయంలో అనేక ప్రాంతాల్లో నామమాత్రమే. కట్టల పటిష్టత ప్రకటనలకే పరిమితమైంది. ఈ పరిస్థితుల్లో అన్నదాతల రెక్కల కష్టం నీటిపాలైంది. అదే కాల్వలు బాగు చేసి ఉంటే పొలాల్లోని నీరంతా వెళ్లిపోయి.. కొంతైనా పంట చేతికి అంది ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా లేకపోవడంతో పంటంతా నీటిపాలైంది.



విజయపురిసౌత్ : కొత్తపల్లిలో మిర్చి పంటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి వెంకట్రావు

సాయం చేస్తేనే గట్టెక్కుతారు..

రెక్కల కష్టం నీటిపాలై.. అప్పులు కళ్ల ముందు కనిపిస్తోన్న తరుణంలో రైతులు ప్రభుత్వం అందించే సాయం కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ఇందులోనూ అనేక ప్రతిబంధకాలు రైతుకు శాపంగా మారనున్నాయా అనే సందేహాలు వెంటాడుతున్నాయి. ముఖ్యంగా ఈ-క్రాప్ నమోదు పూర్తి స్థాయిలో జరగలేదు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుత నష్ట పరిహారం పొందేందుకు వివరాలను ఏపీ ఎయిమ్స్ యాప్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం సూచిస్తోంది. అయితే ఇందుకు తొలుత ఈ క్రాప్ తప్పనిసరి అన్న నిబంధన ఉంది. ఇక సీసీఆర్‌సీ (మిగతా 8వ పేజీలో)

రూ.1.77 కోట్లతో యంత్రాలు

పట్టణంలో పారిశుధ్యం మెరుగయ్యేనా?

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట మున్సిపాల్టీ పారిశుధ్య పనుల నిర్వహణకు ప్రత్యేకంగా యంత్రాలను కొనుగోలు చేసింది. ఇందుకు రూ.1.77 కోట్లు వెచ్చించింది. రూ.1.20 కోట్లతో 40 టన్నుల సామర్థ్యం కలిగిన కంపాక్టర్ కొనుగోలు చేసింది. దీనికి ప్రభుత్వం రూ.60 లక్షలు, మున్సిపాల్టీ రూ.60 లక్షలు చెల్లించింది. ప్రతి రోజూ పట్టణంలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను ఈ యంత్రం ద్వారా యడ్లపాడు సమీపం లోని జిందాల్ విద్యుత్ ఉత్పతి కేంద్రానికి తరలించనున్నారు. రోడ్ల మార్జిన్లలో పేరుకుపోయే మట్టి కుప్పలను తొలగించేందుకు రూ.17 లక్షలతో డొజర్‌ను కొనుగోలు చేశారు. మున్సిపాల్టీ పరిధిలో వివిధ పనుల నిర్వహణకు రూ.40 లక్షలతో ఎక్స్‌కవేటర్‌ని కొనుగోలు చేశారు. ఆయా యంత్రాలతో పారిశుధ్య పనులు నిర్వహించనున్నారు. ఇక నైనా పట్టణంలో పారిశుధ్యం మెరుగుదల అవుతుందో లేదో చూడాలి.



డ్రొజర్



ఎక్స్‌కవేటర్



కంఫాక్టర్

దూరవిద్య డిగ్రీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, పరీక్షల విభాగ కో-ఆర్డినేటర్ ఆచార్య డి. రామచంద్రన్ తెలిపారు. నవంబరు 12వ తేదీలోగా రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. పేపర్‌కు రూ. 770 ఫీజు చెల్లించాలని వెల్లడించారు. వివరాలను వర్సిటీ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని తెలిపారు.

8 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

విజయపురిసౌత్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎగువున శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో శుక్రవారం నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ అధికారులు ప్రాజెక్ట్ 8 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 589.80 అడుగులు ఉంది. ఇది 311.44 టీఎంసీలకు సమానం.




8 క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

కుడి కాలువ ద్వారా 2053, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 28,704, 8 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 64,632 మొత్తం ఔట్‌ఫ్లో 95,389 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 95,389 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

0.4575 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల,అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణా నదిపై నిర్మితమైన నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో గురువారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 0.4575 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 5 గేట్లను 3 మీటర్ల మేర ఎత్తి 78,425 క్యూసెక్కులు టేల్ రేస్ చానల్ ద్వారా 4346 క్యూసెక్కులు మొత్తంగా 82,771 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నారు. ఎగువన సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 86,597 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు.రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080 టీఎంసీలకు సమానమన్నారు.

చప్టాలపై వరద ప్రవాహం



అరవింద వారధి వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి



గాజుల్లంక వద్ద వరద ఉధృతికి నిలిచిపోయిన మత్స్యకారుల పడవలు

కొల్లూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి మళ్లీ వరద పోటెత్తింది. గురువారం ఉదయం నుంచి క్రమేపి నదిలో నీటి మట్టం పెరుగుతూ శుక్రవారం ఉదయానికి ఉధృతమైంది. దీంతో మండల పరిధిలోని గాజుల్లంక చినరేవులో వరద నీరు పోటెత్తడంతో దోనేపూడి వద్ద లోలెవల్ చప్టాపై వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో అక్కడ రాకపోకలను పోలీసు, రెవెన్యూ అధికారులు నిలిపి వేశారు. ఉదయం 10 గంటల కు కొంతమేర వరద తగ్గుముఖం పట్టినప్పటికీ సాయంత్రం 6 గంటల సమయంలో ప్రకాశం బ్యారేజీ నుంచి 4,56,400 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేయడంతో వరద పెరిగే అవకాశాలున్నాయి.

రైతు నష్టం పూడ్చలేనిది

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



వరద ముంపునకు గురైన మిర్చి పైరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

యడ్లపాడు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పత్తి, మిర్చి పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారికి కలిగిన నష్టం పూడ్చలేనిదని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శుక్రవారం యడ్లపాడు మండలంలోని తిమ్మాపురం, సొలస, నాదెండ్ల మండలంలోని జంగాలపల్లి, నాదెండ్ల గ్రామాల్లో ఆయన పర్యటించారు. తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పత్తి, మిరప పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి జరిగిన పంట నష్టం..పెట్టుబడి వ్యయం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భగా ప్రత్తిపాటి మాట్లాడుతూ రైతులు కోలుకోవాలంటే ఇన్‌పుట్ సబ్సిడీ పెంచాలన్నారు. ఏ రైతును కదిలించినా దీనిని కోరుతున్నారని చెప్పారు. రైతు పక్షపాతి అయిన సీఎం చంద్రబాబునాయుడి దృష్టికి రైతుల అభిప్రాయాలను తీసుకెళతామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వనరుల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వమే భారాన్ని మోయాలని, ఇన్‌పుట్ సబ్సిడీని పెంచడంతోపాటు ఇన్సూరెన్స్ ఉన్నా లేకున్నా రైతులందరికీ అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. వాగులు, వంకలు పొంగి పొర్లడంతో నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, మోటార్లు పూర్తిగా మునిగిపోయి పనిచేసే పరిస్థితి లేకుండా పోయిందని ప్రత్తిపాటి తెలిపారు. ఈ పథకాలన్నింటికీ.. యుద్ధప్రాతిపదికన మరమ్మత్తులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు ఇన్‌పుట్ సబ్సిడీ కింద పరిహారం పొందితే సీసీఐ ద్వారా పత్తికొనుగోలు చేయరంటూ వ్యవసాయ సి బ్బంది అసత్య ప్రచారం చేస్తున్నారంటూ రైతు నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో ఆయన వ్యవసాయ అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేకుండా అనవసర ప్రచారం చేయొద్దని స్పష్టం చేశారు. ఆయన వెంట జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు మద్దూరి వీరారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ కరిముల్లా, టీడీపీ మండల అధ్యక్షుడు కామినేని సాయిబాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అన్నదాతలను అన్ని విధాలా ఆదుకుంటాం

ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

కొల్లూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుపాను, వరదల వల్ల పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ శుక్రవారం పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలంలోని చింతమోటు, పెసర్లంక, పెదలంక, గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో రేపల్లె, వేమూరు నియోజకవర్గ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ వరదలు, తుఫాన్ వల్ల ఈ ప్రాంతంలో పంటలకు అపార నష్టం కలిగింద న్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందు చూపుతో ప్రజ లకు ఎలాంటి ఇబ్బందులు కలగలేదన్నారు. రేపల్లె, వేమూరు నియో జకవర్గాల్లో సుమారు 40 కిలోమీటర్లు రోడ్డు దెబ్బతిందని, పునర్ని ర్మానానికి రూ.40 కోట్లు ఖర్చు అవుతుందని ప్రాథమిక అంచనా వేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం సాగు, డ్రెయినేజ్ కాల్వల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పూడికతో నిండిపోయాయన్నారు. వీటిని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. పడిపోయిన విద్యుత్ స్తంభాలు 239 ఉన్నాయని, వాటి స్థానాల్లో కొత్తవి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో బియ్యం, ఆయిల్, చక్కెర సరఫరా చేస్తున్నట్లు ఎంపీ తెలిపారు. రైతులకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అ ధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న కుటుంబాలకు వెయ్యి రూపాయల నుంచి గరిష్టంగా రూ.3 వేలు ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి, ఆర్డీవో రామలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

పది ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

నరసరావుపేట కల్చరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. శుక్రవారం ఆమె కలెక్టరేట్‌లోని జాషువా సమావేశ మందిరంలో విద్యాశాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు.తొలుత జిల్లాలోని పాఠశాలల ప్రస్తుత పరిస్థితిని సమీక్షించారు. అనంతరం విద్యార్థుల హాజరు, మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యా ప్రమాణాల పెరుగుదల వంటి అంశాలపై అధికారుల నుంచి సమగ్ర నివేదికలను పరిశీలించారు. పది ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో ఉంచడమే కాకుండా ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, విద్యాశాఖాధికారులు, హెచ్‌ఎంలు, కేజీబీవీ, ఆదర్శ, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా, చిత్రంలో డీఈవో చంద్రకళ తదితరులు

సర్దార్ వల్లభభాయ్ పటేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

ఏఎన్‌యూ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభభాయ్ పటేల్‌ను ఆదర్శంగా తీసుకొని నేటి యువత సమాజ సేవలో ముందుకు సాగాలని ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు అన్నారు. వర్సిటీలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శుక్రవారం సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. పటేల్ జాతి, మత, భాష వ్యత్యా సాలను తగ్గిస్తూ.. భారత దేశ సమగ్రతకు పాటుపడ్డారని పేర్కొన్నారు. రెక్టార్ శివరాం ప్రసాద్ మాట్లాడుతూ.. విభిన్న సంస్థల ను భారత దేశంలో విలీనం చేయడం ద్వారా దేశాన్ని ఐక్యంగా పటేల్ ఉంచారన్నారు. ఐక్యత దినోత్సవం భారతీయ సమైక్యతను గౌరవించడంలో ముఖ్యపాత్ర పోషించిందన్నారు. అనంతరం రాష్ట్రీయ ఏకత దివస్ ప్రతిజ్ఞ చేయించారు. ముందుగా వర్సిటీ ప్రధాన గేటు నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ దివ్య తేజోమూర్తి, రిజిస్ట్రార్ జి.సింహాచలం, అధ్యాపకులు పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు తదితరులు

ఐక్యంగా ఉంటే దృఢంగా ఉంటాం : ఎస్పీ కృష్ణారావు

నరసరావుపేట లీగల్, అక్టోబరు 31(ఆంధ్ర జ్యోతి), ఐక్యంగా ఉంటే దృఢంగా ఉంటామని సందేశాన్ని అందించడమే ఐక్యత దినోత్సవం ముఖ్య ఉద్దేశం అని ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా శుక్రవారం పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయ న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా ని వాళులర్పించారు. సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ బీ కృష్ణారావు

గ్యాంగ్ రేప్ కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

నరసరావుపేట లీగల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఓ మహిళపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడి, హతమార్చినట్లు నేరం రుజువు కావడంతో నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి డాక్టర్ నేతి సత్య శ్రీ శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గణపవరం గ్రామానికి చెందిన ఓ మహిళ (45) భర్త చనిపోవడంతో గ్రామంలోని పీర్ల చావడిలో ఒంటరిగా నివసిస్తుంది. ఆమె నివాసం వుంటున్న గది పక్కనే గణపవరంలోని ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రంలోని భద్రక్ జిల్లా ఫతేపూర్ మండలం లెంతర గ్రామానికి చెందిన మనోజ్ మాలిక్ నివసిస్తున్నాడు. పనిచేసే ప్రదేశంలో మాలిక్‌కు గణపవరానికి చెందిన మద్దిబోయిన సాంబశివరావు ఎలియాస్ సాయి పరిచయమయ్యాడు. వీరు ఇరువురు కలిసి 2024 ఆగస్టు 8వ తేదీ రాత్రి సదరు మహిళ గదిలోకి అక్రమంగా ప్రవేశించారు. ఆమెపై అత్యాచారం చేసి అనంతరం హతమార్చారు. ఈ మేరకు మృతురాలి కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. విచారణలో నేరం రుజువు కావడంతో పై విధంగా కోర్టు తీర్పును వెలువరించింది.

జాబ్ మేళాలో 141 మందికి ఉద్యోగాలు



ఆఫర్ లెటర్లు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు, అధికారులు

తుళ్లూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుళ్లూరులోని ఏపీ సీఆర్డీఏ స్కిల్ హబ్ ప్రాంగణంలో శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ జాబ్ మేళాను నిర్వహించారు. మొత్తం 627 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 141 మంది ఉద్యోగాలు పొందారు. అదనంగా 43 మంది అభ్యర్థులను వివిధ కంపెనీలు షార్ట్‌లిస్ట్ చేశాయి. ఎంపికైన అభ్యర్థులకు ఏపీ సీఆర్డీఏ సామాజిక సంక్షేమ విభాగం డీసీడీఓ శ్రీ బొర్రా శ్రీనివాసరావు.. సంస్థల హెచ్‌ఆర్ ప్రతినిధుల సమక్షంలో ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఏపీఎస్‌ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అరుణకుమారి, సీఆర్డీఏ సీనియర్ లైవ్లీహుడ్ ఆఫీసర్ శంకర్, జూనియర్ లైవ్లీహుడ్ స్పెషలిస్టులు క్రాంతికుమార్, నరసింహులు, వెంకటేశ్వర్లు సమన్వయం చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00

32,256 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 29,634 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 32,256 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 5,059 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	12500
334	10000	15200	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14200	334	10500	15000
273	---	---	నెంబరు. 5	10000	14400
341	10000	16000	273	---	----
4884	---	----	341	10000	16000
సూపర్ 10	----	---	4884	11000	14000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15000	తేజ	10000	15000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15300
బ్యాడిగి	10500	15300	దేవనూరు డీలక్స్	10500	14500
దేవనూరు డీలక్స్	10000	14700	తాలుకాయలు	5000	8000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మాచర్ల, అనుపు, కొప్పునూరు, పరాశక్తి ఫీడర్స్‌కు సంబంధించి విద్యుత్‌లైన్ల మెయింటెనెన్స్ నిమిత్తం శనివారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ రామయ్య తెలిపారు. అనుపు లిఫ్ట్ ఇరిగేషన్, కొప్పునూరు లిఫ్ట్ ఇరిగేషన్, మాచర్ల పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు తహసీల్దార్ కార్యాలయం, రామా టాకీస్‌లైన్, నెహ్రూనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించనున్నట్లు చెప్పారు. అలాగే దుర్గి మండలంలోని నిదానంపాడులో ఆర్‌డీఎస్ఎస్ వర్క్స్, అమ్మవారికి ఆలయానికి సంబంధించిన డీటీఆర్ ఎరెక్షన్ వర్క్స్ జరుగుతున్నందున అడిగొప్పుల సబ్‌స్టేషన్ నుంచి నిదానంపాడు ఫీడర్ వరకు శనివారం నుంచి వారం రోజులపాటు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

● గురజాలటౌన్ : మండలంలోని పులిపాడు సబ్‌స్టేషన్లో కొత్త బ్రేకర్స్ ఎరెక్షన్ వర్క్స్ జరుగుతున్నందున శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పులిపాడు, దైద, తేలుకుట్ల, గొట్టిముక్కల, సమాధానంపేట గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ ప్రసాద్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు పట్టణంలో ఎమ్మెల్యే పర్యటన

మాచర్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శనివారం మాచర్ల పట్టణంలో పర్యటించనున్నారు. దుయం 8:30 గంటలకు 15వ వార్డులోని రైల్వే స్టేషన్ రోడ్, మూర్తయ్య గారి బజారు, నీలిమా థియేటర్ పక్కనున్న కాలనీలో పించన్ పంపిణీ, వరద బాధితులకు ఉచిత సరుకుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారు. 11 గంటలకు రాయవరం జంక్షన్, బైపాస్ పక్కన కొమ్మిరెడ్డి లక్ష్మారెడ్డి నూతన భవన సముదాయాల నిర్మాణానికి భూమి పూజలో పాల్గొననున్నారు.

విద్యార్థులకు ఆధార్ నమోదు

క్రోసూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఊటుకూరు జడ్పీ హైస్కూల్లో శుక్రవారం విద్యార్థులకు ఆధార్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆధార్ అసిస్టెంట్ మేదర రాఘవరాజు ఆధ్వర్యంలో సుమారు 50 మంది విద్యార్థులకు ఆధార్ నమోదు చేశారు. ఆధార్‌లో తప్పుల సవరణతో పాటు ఆధార్ లేని వారికి కొత్తగా నమోదు చేసుకొనే అవకాశం కూడా కల్పించినట్లు చెప్పారు. 3వ తేదీన బయ్యవరం హైస్కూల్లోను, 4న క్రోసూరు మోడల్ స్కూల్, 5న నాగవరం, 6న హసానాబాద్ హైస్కూళ్లల్లో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఊటుకూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా యమున

నకరికల్లు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : నకరికల్లు డిప్యూటీ ఎంపీడీవోగా జె.యమునను నియమిస్తూ కలెక్టర్ కృతికా శుక్ల శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతిపై ఆమె నకరికల్లు కు బదిలీపై రానున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కారంపూడి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురంలో శుక్రవారం విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎస్‌కే సైదావలి పశువుల పాకలో పశువులకు నీళ్ల తాపేందుకు మోటారు వేయడానికి వెళ్లే సమయంలో మోటారు లైన్ వైరు తెగి అతడిపై పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

సీసీ రోడ్ల నాణ్యత తనిఖీ

రెంటచింతల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రెంటచింతల, జెట్టిపాలెం, పశర్లపాడు, మల్లవరం తదితర గ్రామాల్లో రూ.కోటి 5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను క్వాలిటీ కంట్రోల్ అధికారుల బృందం శుక్రవారం తనిఖీ చేసి 52 శాంపిల్స్‌ను సేకరించారు. రోడ్ల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ ఉండదని స్పష్టం చేశారు.

ప్రతి ఒక్కరి వివరాలు తీసుకోవాలి

సత్తెనపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లాడ్జిల్లో రూమ్ తీసుకున్న ప్రతి ఒక్కరి వివరాలను, ఐడీ ప్రూఫులను లాడ్జి ఓనర్స్, మేనేజర్లు తీసుకోవాలని పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావు అన్నారు. శుక్రవారం లాడ్జి ఓనర్స్ మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాడ్జిల్లో పేకాట, మద్యం తాగడం, అసాంఘిక కార్యకలాపాలు నిషేధమన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలను, అసాంఘిక కార్యక్రమాలను నియంత్రించటంలో లాడ్జి యజమానులు పోలీసుశాఖకు సహకరించాలన్నారు.

అవినీతి నిర్మూలనకు కృషి చేయాలి

● ఎన్టీపీసీ ఉద్యోగులు

మాచర్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధికి అవినీతి ఆటంకమని, అవినీతి లేని సమాజమే లక్ష్యంగా అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండలంలోని తాళ్లపల్లి సమీపంలో గల నేషనల్ థర్మల్ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) డీజీఎం జి.దివాకర్, చీఫ్ మేనేజర్లు రామ శివకోటయ్యలు అన్నారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా ఎన్టీపీసీ ఉద్యోగులు శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎన్టీపీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

● అచ్చంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అవినీతి నిర్మూలనపై సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ చేపట్టిన ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ స్వర్ణమ్మ, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు ఓపెన్ హౌస్

అమరావతి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) పోలీసుల అమరవీరుల దినోత్సవం పురస్కరించుకుని ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ అచ్చియ్య ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులకు పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించి, అవగాహన కల్పించారు.

ఆక్రమణలు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పిడుగురాళ్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల చెరువు భూమిలో అనధికార నిర్మాణాలపై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన చెరువులో ఇళ్లు అనే కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. చెరువు భూమిలో వేరే సర్వేనెంబరుతో రిజిస్టర్ చేయించుకోవడమే కాకుండా అధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే నిర్మాణాలు చేపడుతుండటంతో అనధికార నిర్మాణాలతో చెరువు అంతా నిండిపోతుందని రెండు రోజుల క్రితం కురిసిన అధిక వర్షాలకు సమీపంలోని కాలనీలన్నీ నీట మునిగాయి. చెరువులో ఆక్రమణలను తొలగించాలని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కూడా కాలనీలో పర్యటించినప్పుడు చెప్పారు. చెరువు భూమిలో ఎటువంటి అనధికార నిర్మాణాలకు తావివ్వొద్దని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కూడా అధికారులకు సూచించడంతో అనధికార నిర్మాణాల తొలగింపునకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు.



నకరికల్లు ఎన్ఎస్‌పీ కాలనీలో ఆక్రమణలు తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు



పిడుగురాళ్లలో అనధికార నిర్మాణాలను కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నకరికల్లు ఎన్ఎస్‌పీ కాలనీలో

నకరికల్లు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నకరికల్లు ఎన్ఎస్‌పీ కాలనీలో ప్రభుత్వ భూమిని ఆక్రమించిన ఆక్రమణ దారులను తహసీల్దార్ కే పుల్లారావు ఆదేశాల మేరకు వీఆర్‌వోలు ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణలను తొలగించారు. నకరికల్లు ఎన్ఎస్‌పీ కాలనీలో గాని, నకరికల్లులోని ప్రభుత్వ భూముల్లో ఎవరైనా అక్రమంగా ఆక్రమణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం ప్రభుత్వ భూమి ఆక్రమణ శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. శుక్రవారం ప్రభుత్వ భూముల ఆక్రమణలను నియంత్రించేందుకు రెవెన్యూ అధికారులకు, సర్వేయర్లకు మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ ఆక్రమణల తొలగింపులో వీఆర్‌వోలు శారదా, అబ్బిరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రజలకు వివరించాలి

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



9వ వార్డులో జరిగిన టీడీపీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో సంవత్సరంన్నర కాలంలో జరిగిన అభివృద్ధిని 9వ వార్డు పరిధిలోని కూటమి నాయకులు, సచివాలయ ఉద్యోగులు ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. 9వ వార్డులో కూటమి నేతలు, సచివాలయ ఉద్యోగులతో ఆయన సమావేశంలో మాట్లాడుతూ కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. 9వ వార్డులో రూ.50 లక్షల మేర అభివృద్ధి పనులు జరిగాయన్నారు. పారిశుధ్య సమస్యలు లేకుండా సచివాలయ ఉద్యోగులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వివిధ సమస్యలపై సచివాలయానికి వచ్చే ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు చౌట శ్రీనివారావు, ఎలినేడి రామస్వామి, దరువూరి నాగేశ్వరరావు, మస్తాన్‌వలి, బలిజేపల్లి సురేష్ కుమార్, నూర్‌బాషా జాన్‌బాబు, మర్రి వెంకట రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో గల తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో కన్నాకు అందించారు. నేరుగా సంబంధిత అధికారులతో కన్నా మాట్లాడి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు.

కలెక్టర్‌ను కలసిన ఎమ్మెల్యే కన్నా



కలెక్టర్‌ను కలసిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి : పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లాను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం నరసరావుపేటలోని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్‌ను ఆయన కలిశారు.

విద్యుత్ ప్రాజెక్టును సందర్శించిన విద్యుత్ సౌధ సీఈ

రెంటచింతల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సత్రశాలని కృష్ణానదిపై నిర్మించిన నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టును విద్యుత్ సౌధ హైడల్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ విశ్వేశ్వరరావు ఈఈ హరనాథ్‌లు శుక్రవారం సందర్శించారు. తొలుత రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి జరిగే ఎంసీఆర్(మెయిన్ కంట్రోల్ రూమ్)ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రస్తుతమున్న బ్యాటరీ బ్యాంకుకు అదనంగా మరొకటి ఏర్పాటు చేయాలని ఇంజనీర్లు కోరారు. కరెంట్ తయారీ అనంతరం టేల్ రేస్ ఛానల్ ద్వారా ఇప్పటి వరకు 45 టీఎంసీల నీరు పులిచింతలకు విడుదల చేసినట్లు ఎస్ఈ కె. వెంకటరమణ వివరించారు. 80 ఎంయూల విద్యుత్ తయారు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 62.8 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగిందన్నారు. కార్యక్రమంలో జీఎం శ్రీనివాస్, ఈఈలు నాగరాజు, సుబ్రహ్మణ్యం, ఏడీఈలు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల తయారీకి ఘన, ద్రవ వ్యర్థాలను ఉపయోగించాలి

● అసిస్ట్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు

క్రోసూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఘన, ద్రవ, వ్యర్థ పదార్థాలను ఎరువుల తయారీకి ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని అసిస్ట్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం క్రోసూరు మం డల పరిషత్ కార్యాలయంలో అసిస్ట్ - ఐటీసీ ఆధ్వర్యంలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వాహణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో పీ రవికుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామాల్లో రోజువారీగా సేకరించే చెత్తను సంపద సృష్టి కేంద్రాలకు తరలించి అందులో నుంచి తడి చెత్తను వేరు చేసి ఎరువుగా మార్చాలని చెప్పారు. పొడిచెత్తను రీ సైక్లింగ్ చేసి పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించాలన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, సర్పంచులకు, వీవోఏలకు, సీఆర్‌పీలకు ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్ట్ ట్రెయినర్ బొల్లయ్య, ఈవోపీఆర్‌డీ శ్రీనివాస రావు, ఏపీవో వెంకటేశ్వరరావు, వెలుగు ప్రాజెక్టు మేనేజర్ సలీం పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి రూ.2 లక్షల బీమా చెక్కు



బాధితురాలికి చెక్కును అందజేస్తున్న సొసైటీ చైర్మన్, సభ్యులు

దాచేపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రైతు కుటుంబానికి దాచేపల్లి సహకార బ్యాంకు నుంచి రూ.2లక్షల చెక్కును శుక్రవారం అందజేశారు. దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సొసైటీ అధ్యక్షుడు తంగెళ్ల శ్రీనివాసరావు, సభ్యులు గోళ్ళ నారాయణ, షేక్ జానయ్యల ఆధ్వర్యంలో బ్యాంకు మేనేజర్ ఖాదర్‌బాబు, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, సీఈవో సాంబశివరావు ఆధ్వర్యంలో మృతుడి భార్య దొడ్డ సంధ్యకు రూ.2 లక్షలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బొమ్మిరెడ్డి నారాయణ, షేక్ అహ్మద్, పగడాల భాస్కరరావు, ఐనాల శ్రీరాములు, అఫీజ్, సాధినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఐక్యతా దినోత్సవ ర్యాలీ



మానవహారంగా ఏర్పడ్డ విద్యార్థులు

విజయపురిసౌత్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఆంధ్రప్రదేశ్ గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నయీంభాను ఆదేశాల మేరకు ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. సుమారు 200 మంది విద్యార్థులో జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలు చేశారు. కళాశాల నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ఈ ర్యాలీ సాగింది. అనంతరం మానవహారంగా ఏర్పడి సర్ధార్ వల్లభాయి పటేల్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ అశోక్, కానిస్టేబుళ్లు విజయ్, మస్తాన్, శివాజి, సీఆర్‌పీఎఫ్ కమాండింగ్ ఇన్‌స్పెక్టర్ జయచంద్ర నాయుడు, గిరిష్‌చంద్‌భట్, ఎస్ఐలు, ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, ప్రిన్సిపాల్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి : పట్టణ సీఐ

మాచర్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పట్టణ సీఐ తురకా వెంకటరమణ ఆధ్వర్యాన పట్టణంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ నుంచి అంబేడ్కర్ సెంటర్ మీదుగా పట్టణ సర్కిల్ స్టేషన్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివన్నారు. విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ అనంతకృష్ణ, వడ్డెర కార్పరేషన్ డైరెక్టర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, టీడీపీ నాయకులు జాని, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

పంటల్లో నీరు నిలబడకుండా చూసుకోవాలి

● జిల్లా ఉద్యానశాఖాధికారి వెంకట్రావు

విజయపురిసౌత్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పంటల్లో నీరు నిలబడకుం డా చూసుకోవాలని, నీరు బయటకు వెళ్లే మార్గాలను ఏర్పరుచుకోవాలని జిల్లా ఉద్యానశాఖాధికారి వెంకట్రావు సూచించారు. మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న మండలంలోని కొత్తపల్లి, కొప్పునూరు గ్రామాల్లో పంటలను ఆయన గుంటూరు లాంఫామ్ కీటక శాస్త్రవేత్త నాగేంద్రరెడ్డితో కలిసి పరిశీలించారు. పుచ్చ, మిర్చి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు వెంకటేశ్వర్లు, తులసినాయక్, రైతులు పాల్గొన్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

● ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ నగేష్

వెల్దుర్తి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చని ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ నగేష్ అన్నారు. మొంథా తుఫాన్ కారణంగా మండల పరిధిలో దెబ్బతిన్న పత్తి పంటలను శుక్రవారం శాస్త్రవేత్త గోపాల్, ఏవో బాలాజీగంగాధర్‌తో కలిసి పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వీరి వెంట వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు ఉన్నారు.

పాడి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

● జిల్లా పశుసంవర్ధకశాఖ డీటీ రామారావు

దుర్గి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా పశుసంవర్ధకశాఖ డీటీ రామారావు సూచించారు. మొంథా తుఫాన్ బీభత్సవం నేపథ్యంలో శుక్రవారం ఆయన దుర్గి మండలంలో పర్యటించి పశు వైద్యాధికారులకు, సహాయ సంచాలకులకు పలు సూచనలు చేశారు. సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలన్నారు.

నకిలీ పురుగు మందులపై విచారణ

నకరికల్లు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : నరసింగపాడులోని ఒక రైతు వాడిన నకిలీ పురుగు మందులపై వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. పిడుగురాళ్ళ ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు రైతు వద్ద, రైతు కొనుగోలు చేసిన దుకాణదారుని వద్ద వివరాలను సేకరించారు.

శాంపిల్స్‌ను సేకరించి ప్రయోగశాలకు పంపుతాం

● డీఏవో జగ్గారావు

నరసింగపాడులో నకిలీ పురుగుమందుల వ్యవహారంపై డీఏవో జగ్గారావు మాట్లాడుతూ సంబంధిత దుకాణంలోని పురుగుమందుల శాంపిల్స్‌ను సేకరించి నాణ్యతా ప్రమాణాల పరిశీలన కోసం ప్రయోగశాలకు పంపుతామని తెలిపారు. శనివారం ఈ మేరకు ఏవోకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇస్తున్నట్టు జగ్గారావు తెలిపారు.

ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ ఎన్నికల నోటిఫికేషన్

పెదకూరపాడు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఏపీఎన్‌జీవో అసోసియేషన్ పెదకూరపాడు తాలూకా యూనిట్ నందు శుక్రవారం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినట్టు ఎలక్షన్ ఆఫీసర్ ఈవీ అప్పారావు, అసిస్టెంట్ ఎన్నికల అధికారి ఎస్ అంబేడ్కర్ తెలిపారు. పరిశీలకులు ఏవీ కోటేశ్వరరావును నియమించారని వివరించారు. అమరావతి, అచ్చంపేట, పెదకూరపాడు తాలూకా యూనిట్‌కు 6వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి ఓటర్ల నమోదు జరుగుతుందని, 13వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు నామినేషన్, 20వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయని వివరించారు. ఎన్నికల షెడ్యూల్ కాపీని తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, శ్రీనివాసరావులకు అందించినట్లు వారు వివరించారు.

కార్మిక హక్కుల సాధన సంఘం ఏఐటీయూసీ

● నియోజకవర్గ కార్యదర్శి బాబురావు

మాచర్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కుల సాధనకు ఏర్పడిన మొట్ట మొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ అని నియోజకవర్గ కార్యదర్శి మిద్దెపోగు బాబురావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఏఐటీయూసీ 106వ సంవత్సరంలోకి అడుపెట్టిందన్నారు. ఎన్నో మహోన్నత ఉద్యమాలను నడిపి కార్మికుల పక్షాన నిలిచిందన్నారు.

● పెదకూరపాడు: ఏఐటీయూసీ నాయకుల పోరాట ఫలితమే అనేక కార్మిక చట్టాలు వచ్చాయని సీపీఐ నాయకులు పఠాన్ నాగుల్ మీరా అన్నారు. పెదకూరపాడులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు.

ఉపాధి హామీ పనులు గుర్తిస్తాం : ఏపీవో

మాచవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కలసి చేపడుతున్న జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు గుర్తిస్తామని ఏపీవో కోటిరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని వేమవరం గ్రామ సచివాలయంలో ఉపాధి హామీ పనుల గుర్తింపుపై గ్రామసభ నిర్వహించారు.

బకాయిల చెల్లింపునకు ప్రత్యేక చర్యలు

రెంటచింతల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూపు సభ్యులు యూనియన్ బ్యాంకు నుంచి రుణాలు తీసుకుని తిరిగి చెల్లించకుండా కాలయాపన చేస్తున్న సభ్యుల వివరాలను సేకరించాలని ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకు మేనేజర్ కె.చినహనుమంతునాయక్, డ్వాక్రా ఏపీఎం కృపావేణి ఇతర అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ రుణాలు తీసుకున్న వారందరికీ తొలుత నోటీసులు జారీ చేయాలన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థులు

పెదకూరపాడు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి 69వ ఎస్‌జీఎఫ్ అండర్- 17 బాలబాలికల వాలీబాల్ పోటీలు గుంటూరు జిల్లాలోని పెదకాకాని మండలం నంబూరులో జరిగాయి. ఈ పోటీల్లో పెదకూరపాడు జీఆర్ సీఆర్‌కే శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు బాలికల విభాగంలో ఐదుగురు మెయిన్ టీమ్‌కు ఒకరు స్టాండ్‌బై ప్లేయర్‌గా ఆరుగురు ఎంపికైనట్టు జీఆర్‌సీఆర్‌కే శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ గుత్తా కవిత రాము శుక్రవారం తెలిపారు. ఎంపికైన వారిని పాఠశాల యాజమాన్యం అభినందించారు.

త్వరగా రికవరీ చేయాలి

● ఎన్ఆర్ఈజీఎస్ పీడీ సిద్దలింగప్ప

పిడుగురాళ్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో సోషల్ ఆడిట్‌లో గుర్తించిన రికవరీని త్వరగా చెల్లించేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా పీడీ సిద్దలింగమూర్తి తెలిపారు. శుక్రవారం పిడుగురాళ్ల కార్యాలయంలో మాచవరం, పిడుగురాళ్ల మండలాలకు సంబంధించి సోషల్ ఆడిట్, విజిలెన్స్ అధికారులు, ఏపీవోలు గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. గతంలో సోషల్ ఆడిట్‌లో గుర్తించిన రికవరీని ఇన్నాళ్లుగా ఎందుకు వసూళ్లు చేయలేదో సమాధానం చెప్పాలని అధికారులను ప్రశ్నించారు. ఆర్ఆర్ యాక్ట్ కింద వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల ఎంపీడీవో వాణి, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి విజయకుమారి, పిడుగురాళ్ల, మాచవరం మండలాల ఏపీవోలు వెంకటేశ్వర్లు, కోటిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు నిత్యావసరాల పంపిణీ



రుద్రవరంలో తుఫాన్ బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ, అధికారులు, ప్రజా ప్రతినిధులు

అచ్చంపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రవరం, కేవీ పాలెం గ్రామాల్లో తుఫాన్ బాధితులకు నిత్యావసరాలను ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ, ప్రజాప్రతినిధులు, అధికారులు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో కే శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పాటిబండ్ల బాపిరాజు, బిక్కి సీతయ్య, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నగదు పంపిణీ



పునరావాస కేంద్రంలో తుఫాన్ బాధితులకు నగదు పంపిణీ చేస్తున్న అధికారులు

క్రోసూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్లేరులో రెండు రోజులుగా పునరావాస శిబిరంలో ఉన్న 15 కుటుంబాల వారికి శుక్రవారం అధికారులు ఆర్థిక సాయాన్ని పంపిణీ చేశారు. మొత్తం 45 మందికి వెయ్యి రూపాయల చొప్పున నగదు అందజేసినట్టు తహసీల్దార్ వేముల వెంకట నాగరాజు తెలియ జేశారు. దీనితో పాటు ఐదు రకాల నిత్యావసరాలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పీ రవికుమార్, ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● అమరావతి: లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తూ పునరావాస కేంద్రానికి తరలించిన 30కుటుంబాలకు రూ62వేల నగదును పంపిణీ చేసినట్లు తహసీల్దార్ డానియోలు తెలిపారు. పెదమద్దూరు, మల్లాదిలో ఈ పరిహారాన్ని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ డానియోలుతో పాటు రెవెన్యూ సిబ్బంది, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాజుపాలెం మండలంలో..



గణపవరం గ్రామంలో తుఫాను బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో, టీడీపీ నేతలు

రాజుపాలెం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం, కొత్తూరు, చౌటపాపాయ పాలెం, కొండమోడు గ్రామాల్లో మొంథా తుఫాను బాధిత 56 కుటుంబాలకు శుక్రవారం నిత్యావసరాలను తహసీల్దార్ సరోజ, ఎంపీడీవో శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు అంచుల నరసింహారావు, నాయకులు అంకాళ్ల ప్రభుదాసు, సానికొమ్ము కోటిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మొరసా శ్రీనివాసరావు, దమ్మాలపాటి యల్లయ్య, సర్పంచ్ కూందురు పేతురు, డీటీ జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

సీఎం ముందు చూపుతో నష్టాలను తగ్గించగలిగాం

● సహకార సంఘ అధ్యక్షుడు తంగెళ్ళ శ్రీనివాసరావు

దాచేపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుచూపుతో తుఫాన్ నుంచి ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించుకోగలిగామని దాచేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు తంగెళ్ళ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం దాచేపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనతో పాటు సొసైటీ నారాయణ, షేక్ జానయ్య తదితరులు ఉన్నారు.

సస్యరక్షణతో ఉద్యాన పంటలకు ఊపిరి

తక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ

నరసరావుపేట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ నేపథ్యంలో వరద ముంపునకు గురైన ఉద్యాన పంటలను ఉద్యాన అధికారి ఐ.వెంకట్రావు, లాంఫాం కీటక శాస్త్రవేత్త డాక్టర్ బి.నాగేంద్రరెడ్డి శుక్రవారం పరిశీలించారు. మాచర్ల మండలంలోని కొత్తపల్లి, కొప్పునూరు గ్రామాల పరిధి సాగులో ఉన్న మిరప, పుచ్చసాగును పరిశీలించిన అనంతరం రైతులతో మాట్లాడారు. ఉద్యాన పంటల సస్యరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు.

మిరప పంటలో జాగ్రత్తలు

మొదటగా మిరప తోటలో నీరు నిలబడకుండా బయటకు వెళ్లే మార్గాలను చేసుకోవాలి.వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు చుట్టూ మట్టిని ఎగదోయాలి. మొక్కలు ఉరుకెత్తి తలలు వాల్చినట్లయితే వెంటనే తేరుకోవడానికి లీటర్ నీటికి 10 గ్రాముల యూరియా కలిపిన ద్రావణాన్ని వారంలో రెండుసార్లు పిచికారి చేయాలి. వడలిన మొక్కలకు లీటర్ నీటికి ఐదు గ్రాముల మెగ్నిషియం సల్ఫేట్ కల్పిన ద్రావణం పిచికారి చేయాలి. ఇనుప ధాతు లోపంతో మొక్కలు పాలి పోయినట్లు కనబడితే 10 లీటర్ల నీటికి 50 గ్రాముల అన్నభేదితో పాటు ఒక నిమ్మచెక్క రసం కలిపి పిచికారి చేయాలి. పైపాటుగా అద నంగా ఎకరానికి 50 కేజీల యూరియా 250 కేజీల వేపపిండి వేయాలి. నేల అదును వచ్చిన వెంటనే గొర్రు అంతర కృషి చేయాలి. మొక్కలు తేరుకున్న తర్వాత స్థూల పోషకాల మిశ్రమాన్ని ఐదు గ్రాములు లీటర్ నీటికి.. సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 2.50 గ్రాములు లీటర్ నీటికి ఒక దాని తర్వాత ఒకటి వారం రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడుసార్లు పిచికారి చేయాలి.

బ్యాక్టీరియా ఆకు మచ్చ, కొయినో ఫోర వంటి తెగుళ్ల ఆశించే అవకాశం ఉంది. కాబట్టి ముందు జాగ్రత్త చర్యగా 10 లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్ ఆక్సిక్లైడ్, గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ కలిపిన ద్రావణం పిచికారి చేయాలి. మిరప పంట ముంపునకు గురై పూర్తిగా పంటకు నష్టం వాటిల్లినప్పుడు పంటను తీసివేసి ప్రత్యామ్నాయంగా వేరొకపంటను సాగు చేసుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పొలంలో నిలిచిన నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పంపాలి. బోదెలపై లేదా బెడ్లపై నాటుకోవాలి. వర్షాలు ఆగిన వెంటనే 19:19:19 లేదా 13:0:45 లేదా యూరియా వం టి పోషకాలను పంటకు అందించాలి. అవస రాన్ని బట్టి సూక్ష్మ పోషకాలను కూడా పిచికారి చేసుకోవాలి. నేల కొంచెం ఆరిన తర్వాత రసా యనిక ఎరువులను వేసుకోవాలి. అధిక వర్షాల ను విత్తనం మొలకెత్తినప్పుడు లేదా లేత మొ క్కలు దెబ్బతిన్నప్పుడు నర్సరీలో నారు పెంచుకొని సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. వర్షాలు ఆగిన వెంటనే అంతర సేద్యం చేసి కలుపును తొలగించడమే కాకుండా నేల త్వరగా ఆరేట్లు చేసుకోవాలి.మొక్కలకు ఊతం ఇవ్వడం, పందిళ్లపై తీగజాతి కూరగాయలను సాగు చేసుకోవడం వంటివి చేయాలి.

సస్య రక్షణ చర్యలు

ఆకు తినే పొగాకు లద్దె పురుగు నివారణకు విషపు ఎరలను ఉపయోగించాలి. (అన్ని కూరగాయ పంటలు) అక్షంతల పురుగు, చిత్త పురుగుల నివారణకు వర్షాలు ఆగిన వెంటనే క్లోరిపైరిఫాస్ 2మి.లీ./లీ లేదా థయోడి కార్బ్ 1గ్రా/లీ పిచికారి చేసుకోవాలి. ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ 3గ్రా/లీ లేదా మోటాలాక్సిల్+మంకోజెబ్ ట 2గ్రా/లీ మొక్కల మొదళ్లలో పోయాలి (మిరప, టమాట, క్యాబేజీ) ఆకుపచ్చ తెగుళ్ల నివారణకు కార్బండిజం 1గ్రా/లీ లేదా మంకోజెబ్ 2.5 గ్రా/లీను పిచికారి చేసుకోవాలి(మిరప, టమాటా, చిక్కుడు, ఆకుకూరలు) బూజు తెగులు నివారణకు డైమి థోమర్ఫ్ ట 1.5 గ్రా/లీ లేదా మెటాలాక్సిల్ + మంకోజెబ్ ట 2.0గ్రా/లీను పిచికారీ చేసు కోవాలి (బీర, కాకర, దోస, పొట్ల, సొర) బ్యాక్టీరి యా మచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లో రైడ్ 3 గ్రా/లీ ప్లాంటా మైసిన్ 2 గ్రా/లీ కలిపి పిసికారి చేసుకోవాలి(టమాటా, వంగా, క్యాప్సికం).

మురుగు నీటిని బయటికి పంపాలి మొక్కలు నీటిలో నాలుగు రోజులకంటే ఎక్కువ ఉన్నట్లయితే వయసుతో సంబంధం లేకుండా వేరే పంటలను వేసుకోవాలి మూడుసార్లు యూరియా లేదా పొటాషియం నైట్రేట్ ద్రావ ణాన్ని వారం వ్యవధిలో పిచికారి చేయాలి ప్రా పికొనజాల్,డైఫెన్కోనాజల్ద్రావణాలను రెండుసార్లు వారం వ్యవధిలో పంటపైన పిచికారి చే సినట్లయితే ఆకుమచ్చ, తాటాకు మచ్చ తెగులను నివారించవచ్చు. సూక్ష్మ పోషకాలు మిశ్ర మాన్ని 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసినట్లయితే మొక్కలు త్వరగా కోలుకుంటాయి.


ముంపునరు గురైన మిరప చేనును పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ జిల్లా అధికారి వెంకట్రావు, కీటక శాస్త్రవేత్త బీ నాగేంద్రరెడ్డి


లంకేవానిదిబ్బలో సముద్రం ఉప్పొంగటంతో నీటమునిగిన 320 ఎకరాల వరి పొలాలు

ఉప్పొంగిన సంద్రం

- నీట మునిగిన వరి పొలాలు
- ఆక్వా సాగుకు తీవ్ర నష్టం
- దెబ్బతిన్న బోట్ల మరమ్మతుల్లో మత్స్యకారులు

రేపల్లె, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలోని సముంద్రం ఒడ్డున ఉన్న లంకేవానిదిబ్బలో చేతికొచ్చే వరి పంట, రొయ్యలచెరువులు ఉప్పెన దాటికి నీట మునిగాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటం తా నీటి పాలైందంటూ రైతులు బోరున విలపిస్తున్నారు. గతేడాది తుఫాన్ కారణంగా వందలాది ఎకరాల వరి,పంట రొయ్యల చెరువులు నీట మునిగి లక్షలాది రూపాయలు నష్టపోయామని గుర్తుచేసుకుంటున్నారు. గ్రామంలో మొంథా తుఫాన్ కారణంగా కృష్ణానది సముద్రం కలిసే భూభాగం సమీపంలో ఉన్న వరి పొలాలు 320ఎకరాలు, 200ఎకరాల రొయ్యల చెరువులు నీటమునిగాయి. ఉప్పునీటిలో నానటంతో పొట్ట దశలోని వరి పంట చౌడువేసుకుపోయి మాడిపోయింది. ఇప్పటికే ఎకరాకి రూ.30వేలు పెట్టుబడి పెట్టామని సాగుదారులు అంటున్నారు.

జెట్టీలో పడవలు నీట మునక

లంకేవానిదిబ్బ గ్రామంలో సుమారు 15 వందల మత్స్యకారుల కుటుంబాలు చేపల వేటపై జీవనం సాగిస్తున్నాయి. తుఫాను ధాటికి కొన్నింటికి బోట్ల ఇంజన్లు, కొన్నింటిలో కింద భాగం పూర్తిగా దెబ్బంతిందని మత్స్యకా రులు చెబుతున్నారు. లంకేవానిదిబ్బ జెట్టీలో 200కు పైగా మరబోట్లు ఉన్నాయని 100 బోట్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని వెల్లడించారు. దెబ్బతిన్న బోట్లు, వలలు బాగుచేసుకోవాలంటే రూ.50వేలు పైనే ఖర్చు అవుతుందని అంటున్నారు. రెక్కాడితే డొక్కాడని తమకు వేట లేకపోవటంతో నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకోవాలని కోరుతున్నారు.


దెబ్బతిన్న బోటుకు మరమ్మతులు చేసుకుంటున్న మత్స్యకారులు

320 ఎకరాల పంట నష్టం

- రైతు విశ్వనాథపల్లినాగరాజు

ఉప్పు నీటిలో 320 ఎకరాలుపైనే వరి పొలాలు నానుతున్నాయి. ఎకరాకి రూ.25 వేల నుంచి రూ.30 వేలు వరకు పెట్టుబడి పెట్టాం. రొయ్యల చెరువులపైనా..ఎకరాకు రూ.3 లక్షలు పైనే పెట్టుబడి పెట్టాం. నెలరోజుల్లో చేతికొచ్చే పంట సముద్రం పాలైంది.


సముద్రం ఉప్పొంగటంతో గండ్లుపడిన రొయ్యల చెరువులు



శేషగిరమ్మ బాధ్యత ప్రభుత్వానిదే..

● ఆమె మనమరాలు శ్యామలకు పునరావాసం కల్పించాలి ● ఎస్‌జీపీకి హైకోర్టు ఆదేశం.. విచారణ వాయిదా

అమరావతి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుళ్లూరు మండలం రాయపూడి గ్రామానికి చెందిన నెల్లూరి శేషగిరమ్మ, ఆమె మనువరాలు శ్యామలకు పునరావాసం కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. శేషగిరమ్మ మనువరాలు శ్యామల మానసిక వైకల్యంతో బాధపడుతున్నందున జీవించి ఉన్నంతకాలం ఆమె బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వమే తీసుకోవాలని పేర్కొంది. శేషగిరమ్మ కుటుంబ సభ్యుల నుంచి సీఆర్‌డీఏ తీసుకున్న భూమిలో ఉన్న బోర్ల ద్వారా ఆ కుటుంబం ఆదాయం పొందతోఉందని గుర్తు చేసింది. భూమికి బదులు మరోచోట భూమి ఇస్తే సరిపోదని, వారికి ఆదాయాన్ని చూపించాల్సిన బాధ్యత కూడా అధికారులపై ఉందని తేల్చి చెప్పింది. ఈ అంశాలపై వివరాలు తెప్పించుకొని కోర్టు ముందు ఉంచాలని ఎస్‌జీపీని ఆదేశించింది. విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. మరో వైపు వ్యాజ్యంలోని అభ్యర్థనలపై న్యాయమూర్తి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల చర్యతో అన్యాయం జరిగిందని భావిస్తే అభ్యర్థనలను అంతవరకే పరిమితం చేసి ఉండాల్సిందని వ్యాఖ్యానించారు. పిటిషన్‌లో ఇలాంటి అభ్యర్థనలను గతంలో ఎన్నడూ చూడలేదని, ఈ విషయంలో తాము ఎంత మాత్రం సంతోషంగా లేమన్నారు.

రాయపూడిలోని 5సెంట్ల ఇంటి స్థలాన్ని నిరక్షరాస్యత కారణంగా పొరపాటున ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద సీఆర్‌డీఏకు అప్పగించామని, దానిని తిరిగి తమకు అప్పగించేలా సీఆర్‌డీఏ అధికారులను ఆదేశించాలని కోరుతూ గ్రామానికి చెందిన 90ఏళ్ల వృద్ధురాలు నెల్లూరి శేషగిరమ్మ, చెరుకూరి వెంకాయమ్మ, మనవరాలు చెరుకూరి శ్యామల హైకోర్టును ఆశ్రయించారు. నివాసం ఉండేందుకు ఆ స్థలం మినహా మరొకటి లేదని, తిరిగి ఇవ్వడం వీలుకాకుంటే కారుణ్య మరణానికి అనుమతించాలని కోరారు. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి వాదనలు వినిపించారు. శేషగిరమ్మ కుమార్తె చెరుకూరి వెంకాయమ్మకు 1.43 ఎకరాల భూమి ఉందన్నారు. భూమిని ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చేందుకు సమ్మతి తెలిపారన్నారు. తదనంతరం ఆ భూమిలో 1.38 ఎకరాలను మరొకరికి విక్రయించగా, కొనుగోలు చేసిన వ్యక్తి సీఆర్‌డీఏ రిటర్నబుల్ ప్లాట్‌ను కేటాయించిందన్నారు. మిగిలిన 0.5 సెంట్లను రిజిస్టర్ సేల్ డీడ్ ద్వారా తండ్రి శేషగిరిరావుకు రిజిస్టర్ చేశారన్నారు. ఆ 5 సెంట్లను శేషగిరిరావు ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద సీఆర్‌డీఏకి అప్పగించారన్నారు. ఆ భూమిలో బోర్లు వేసి దొండపాడు పంచాయితీ వాడుకొంటుందన్నారు. అందుకుగాను శేషగిరిరావుకు ఉద్యోగం కల్పించారన్నారు. శేషగిరిరావు చనిపోయిన తరువాత అతని బంధువుకు ఉద్యోగం ఇచ్చారన్నారు. ప్రస్తుతం శేషగిరమ్మ, మనవరాలు శ్యామల బాధ్యతను అతనే చూసుకుంటున్నాడని వివరించారు. సీఆర్‌డీఏ నిబంధనల ప్రకారం 5సెంట్ల భూమికి టీడీఆర్ బాండ్లు ఇచ్చే వెసులుబాటు మాత్రమే ఉందన్నారు. అయినప్పటికీ శేషగిరమ్మ కుటుంబ సభ్యులు ఇచ్చిన సెంట్ల భూమికి బదులు మరో చోట భూమి ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. మానసిక వైకల్యంతో బాధపడుతున్న శ్యామలకు పెన్షన్ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది బాలయ్య వాదనలు వినిపిస్తూ... శ్యామల 90శాతం మానసిక వైకల్యంతో బాధపడుతున్నట్లు అధికారులు నిర్ధారించారన్నారు. పిటిషనర్లలో ఒకరైన శేషగిరమ్మ కుమార్తె వెంకాయమ్మ పిటిషన్ వేసిన అనంతరం మరణించారన్నారు. వ్యాజ్యంలో ఆమె పేరును తొలగించాలని కోరారు.

వేధింపుల కేసులో జైలు, జరిమానా

గుంటూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికను ప్రేమ పేరుతో లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ. పోక్సో కోర్టు న్యాయాధికారి సుల్తానా బేగం శుక్రవారం తీర్పు చెప్పారు. నిందితుడు నేనావత్ గణేష్ నాయక్‌కు మూడేళ్ల జైలు, రూ. 10వేల జరిమాన, అతనికి సహ కరించిన అన్న నేనావత్ గోవింద్ నాయక్‌కు రూ. 5 వేల జరిమాన విధించారు. చాకలి గుంట, సుగాలి కాలనీకి చెందిన ఓ మైనర్‌ను గణేష్ నాయక్ ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని పదేపదే వెంటపడి.. ఒప్పుకోకపోవడంతో బెదిరింపులకు పాల్పడ్డాడు. అతని అన్న గోవింద్ నాయక్ కూడా ఇందుకు సహకరించాడు. దీంతో వారిపై 2021లో బాలిక తల్లిదండ్రుల లాలాపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో..కేసు నమోదు చేశారు. ఈ కేసు ట్రయల్స్ సమయములో సాక్షులను నిందితులు బెదిరించడంతో.. ప్రస్తుత సీఐ శివ ప్రసాద్ నిందితులపై మరొక కేసు నమోదు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ ఏపీపీ దుర్గ ప్రసాద్ వాదనలు వినిపించారు. హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్, హోం గార్డ్ శాంతికుమారి, కోర్ట్ కానిస్టేబుల్ కె.సురేష్ బాబు నిందితులకు శిక్ష పడుటలో కృషి చేసిన వారందరినీ ఎస్పీ అభినందించారు.

పాముకాటుకు వ్యవసాయ కూలీ మృతి

తాడికొండ, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): పొలం పనిలో ఉన్న వ్యవసాయ కూలీ పాముకాటు వేయడంతో మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. పోలీసులు వివరాల మేరకు.. బండారుపల్లికి చెందిన వ్యవసాయ కూలీ మర్రిపూడి రమేష్. పత్తి చేనులో పనికి వెళ్లాడు. అక్కడ అతనిని పాము కాటు చేయడంతో.. తోటి కూలీలు గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు రమేష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ జోజిబాబు తెలిపారు.

ఉబికి వస్తున్న కన్నీరు!

(5వ పేజీ తరువాయి)

చేనేత పరిశ్రమ తీవ్రంగా దెబ్బతింది. నాలుగు నెలలుగా కురుస్తున్న వర్షాలకు నేతన్నలు పనులు కోల్పోగా, కిందటి నెల కురిసిన ఎడతెరపి లేని వర్షాలు వారిని పీకల్లోతు కష్టాల్లో ముంచేశాయి. ఈ వర్షాల కారణంగా గుంటూరు జిల్లాలోని మంగళగిరి, పేటేరు, ఇసుకపల్లి, రాజోలు, చెరుకుపల్లి, కనగాల, పొన్నూరు, చిలకలూరిపేట, తెనాలి, బాపట్ల జిల్లాలోని ఈపూరుపాలెం, చీరాల, వేటపాలెం, పందిళ్లపల్లి, ఈతముక్కల, వలపర్ల తదితర ప్రాంతాల్లో 25 వేల కుటుంబాలు బాగా దెబ్బతిన్నాయి. చీరాల పరిసర గ్రామాల్లోనే 17 వేల కుటుంబాలు ప్రత్యక్షంగా తుపాను బారిన పడగా.. మంగళగిరిలో 3 వేల కుటుంబాలు, రేపల్లె పరిసర ప్రాంతాల్లో మరో 3 వేల కుటుంబాలు తుపాను ప్రభావానికి గురయ్యాయి. చేతిలో పని ఉన్నా.. అనుకూలమైన వాతావరణం లేకపోవడంతో నేతన్నలు తీవ్రంగా నష్టపోయారు.

ఊటెక్కుతున్న మగ్గం గుంతలు

మొంథా తుపాను ప్రభావం చీరాల పరిసర ప్రాంతాల్లో అత్యంత తీవ్రంగా ఉంది. చీరాల చుట్టుపక్కల ప్రాంతాల్లో మూడు రోజుల పాటు ఎడతెరపి లేకుండా కురిసిన గాలివాన కారణంగా భూగర్భ జలాల నీటిమట్టం విపరీతంగా పెరిగింది. మగ్గాల గుంతల్లోకి నీరు ఊరింది. మగ్గం గుంతల్లో రెండడుగుల మేర చేరిన ఈ నీటిని తోడుకున్నా ఊట వస్తూనే ఉంది. ఈ కారణంగా నీరు పూర్తిగా ఇంకిపోయే వరకూ నేతన్నలకు మగ్గం గుంతలో అడుగుపెట్టే అవకాశం ఉండదు. ఈ నీరు ఇంకడానికి కనీసం రెండు నెలల సమయమైనా పడుతుంది. ఈలోగా మళ్లీ వర్షాలు కురిస్తే పరిస్థితి మరింత దిగజారుతుంది. ఈలోపు మగ్గంపై ఉన్న పడుగు, పేకలు దెబ్బతిని పోతాయి. ఇలా అన్ని విధాలుగా చేనేత కార్మికులు నష్టపోయే అవకాశం ఉంది.

వీడని ముంపు

(5వ పేజీ తరువాయి)

కార్డులు లేకుండా సాగు చేసుకుంటున్న కౌలు రైతుల పరిస్థితే ఏమిటో ఎవరికీ తెలియడంలేదు. ఒక్క బాపట్ల జిల్లా వరకు చూస్తే ఖరీఫ్ ప్రారంభంలో 3,26,000 ఎకరాల సాగు సాధారణ విస్తీర్ణంగా వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈ -క్రాప్‌లో నమోదు చేసింది 2,84,000 ఎకరాలు మాత్రమే. ఇందులో దాదాపు 50,000 ఎకరాల వరకు సాగు చేసుకుంటున్న కౌలుదారు కాకుండా భూ యజ మాని పేరిటే ఈ-క్రాప్‌లో నమోదైంది. రెండు లక్షల మంది వరకు కౌలురైతులు ఉంటే 80,000 మందికి మాత్రమే సీసీఆర్‌సీ కార్డుల పంపిణీ జరిగింది. ఇదే పరిస్థితి పల్నాడు, గుంటూరు జిల్లాల్లోనూ ఉంది. అంటే అటు ఈ-క్రాప్ నమోదు కాని సాగుదారులు, ఇటు కౌలు రైతులు మొంథా పరిహారానికి అర్హులు కాకుండా పోతున్నారు. సాధారణ విస్తీర్ణానికి, ఈ-క్రాప్ నమోదు లెక్కలకు పొంతన లేకపోవడం కూడా పరిహారానికి అడ్డంకులుగా మారనున్నాయి. ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చరల్ ఇన్‌ఫర్మేషన్ మేనేజ్ మెంట్ సిస్టమ్ (ఏపీఎయిమ్స్) యాప్ ద్వారా మాత్రమే పంట నష్టాన్ని అంచనా వేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. అయితే ఈ-క్రాప్‌లో లేకుండా పంట నష్టపోయిన వివరాలను విడిగా నమోదు చేస్తామని యంత్రాంగం చెబుతున్నప్పటికీ దానిపై స్పష్టత లేదు. మూడు రోజుల్లోనే ఏపీఎయిమ్స్‌లో పంట నష్టం వివరాలన్నీ నమోదు చేయాలనే ఆదేశాలు యంత్రాంగానికి అందాయి. ఇంత స్వల్ప వ్యవధిలో ఇది సాధ్యం కాకపోగా అర్హులైన ఎంతో మంది రైతులకు అన్యాయం జరిగే అవకాశం ఉంది. సాంకేతిక చిక్కులపై సడలింపులు ఇవ్వడంతో పాటు, ఏపీ ఎయిమ్స్ యాప్ నమోదే ప్రామాణికంగా కాకుండా మ్యాన్యువల్ నమోదుకు కూడా ఆస్కారమిస్తేనే రైతులు గట్టెక్కే అవకాశం ఉంది.

ఉదారంగా వ్యవహరించాలి

క్షేత్రస్థాయిలో ఈ-క్రాప్ నమోదుకు, ప్రస్తుతం జరిగిన నష్టానికి పొంతన లేదు. ముఖ్యంగా ఏపీఎయిమ్స్ యాప్ విషయంలో నిబంధనలు సడలించకపోతే రైతులకు పరిహారం ఎండమావే. గతంలో బర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసే విషయంలో కూడా ఎయిమ్స్ యాప్‌లో నమోదైన వివరాలకు, ఈ-క్రాప్ లెక్కలకు పొంతన లేకపోవడంతో నిబంధనల విషయంలో ఉదారంగా వ్యవహరించారు. అదేవిధంగా ఇప్పుడు కూడా ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోని వారిని కూడా పరిహారానికి అర్హులయ్యే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌ఎం సుథేష్ణ సేన్

రైల్వేలో ఘనంగా రాష్ట్రీయ ఏకతా దివస్

గుంటూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా రైల్వేలో ఘనంగా రాష్ట్రీయ ఏకతా దివస్‌ని నిర్వహించారు. శుక్రవారం ఉదయం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో డీఆర్‌ఎం సుథేష్ణ సేన్ రైల్వే అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఐక్యత స్ఫూర్తిని పెంపొందిస్తూ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ దేశ ఐక్యత, సమగ్రత, భద్రతపై రైల్వే సిబ్బంది అంకితభావాన్ని కలిగి ఉండాలన్నారు. ఏడీఆర్‌ఎం రమేష్‌కుమార్, సీనియర్ అధికారులు షాబాజ్ హనూర్, వినయ్‌కాంత్, శైలేష్‌కుమార్ పాల్గొన్నారు.

29 వంట గ్యాస్ సిలిండర్లు సీజ్

గుంటూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ కార్యాలయం అధికారులు దాడులు నిర్వహించి వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న 29 వంట గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకొన్నారు. శుక్రవారం సాయంత్రం దాసరిపాలెంలో వడ్డే వెంకట రమణారెడ్డికి చెందిన విజయశ్రీ బిల్డింగ్ మెటీరియల్ వాణిజ్య సముదాయంలో గుంటూరు జిల్లా విజిలెన్స్, సివిల్ సప్లయీస్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. గృహ అవసరాల నిమిత్తం వినియోగించాల్సిన సిలిండర్ల గ్యాస్‌ను చిన్న చిన్న సిలిండర్స్‌లోకి రీఫిల్లింగ్ చేస్తున్నట్లు గుర్తించారు. షాపుల నిల్వ ఉన్న 29 సిలిండర్లు, ఒక మోటార్ స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లయీస్ డీటీ వెంకట్రావుకి అప్పగించి కేసు నమోదు చేయడానికి ఆదేశించారు. సీఐ కె.చంద్ర శేఖర్, ఎంఆర్‌వో లక్ష్మీమాధవి తదితరులు పాల్గొన్నారు.


దాడులలో స్వాధీనం చేసుకున్న సిలిండర్లు

---

48 గంటల్లోగా ధాన్యం సొమ్ము జమ

డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబు నాయుడు

బాపట్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాలతో మధ్యవర్తుల మోసాలకు తావులే దని జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్ వడ్రాణం హరిబాబునా యుడు తెలిపారు. బాపట్లలోని కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి శిక్షణ తరగతులను గురువారం చైర్మన్ ప్రారంభించి, ప్రసంగించారు. రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకుంటుందన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందన్నారు. మధ్యవర్తులు లేకుండా ప్రతి రైతుకు కనీస మద్దతు ధర (ఎమ్ఎస్‌పీ) హామీగా లభిస్తుందని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తారని, రైతులు తమ పంటను సరైన విధంగా సిద్ధం చేసుకోవాలని సూచించారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా సొమ్ము జమ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గ్లోరియా, నాగమల్లేశ్వరి, జమీర్ బాషా, బిజినెస్ మేనేజర్ హరి గోపాలం, డీసీఎంఎస్, ఆర్ఎస్కే సిబ్బంది ఉన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబునాయుడు తదితరులు

7న ఆచార్య ఎన్జీరంగా 125వ జయంతి

● ఉత్సవాలకు ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి

పొన్నూరు, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): రైతు ఉద్యమ నేత ఆచార్య ఎన్జీరంగా 125వ జయంతిని ఈ నెల 7 న లాం ఫాంలో నిర్వహిస్తున్నట్లు ఆచార్య ఎన్జీరంగా జయంతుత్సవ కమిటీ నిర్వాహకులు రామినేని కిషోర్ బాబు తెలిపారు. నిడుబ్రోలు ఆచార్య ఎన్జీరంగా స్వగృహం గో భూమిలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో నిర్వాహకులు మాట్లాడుతూ.. ఎన్జీరంగా యూనివర్సిటీలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పలువురు రాష్ట్ర మంత్రులు ఎంపీలు, ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటలకు ఆచార్య ఎన్జీరంగా జీవిత చరిత్ర ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం అధునాతన వ్యవసాయ యంత్ర పరికరాల ప్రదర్శన, నూతన వండగాల వివరాలు, శాస్త్రవేత్తలు, రైతు నాయకులుతో చర్చలు జరగనున్నట్లు తెలిపారు. ఆచార్య ఎన్జీరంగా అభిమానులు, రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. జయంతుత్సవ కమిటీ సభ్యులు డాక్టర్ సజ్జా హేమలత, బొద్దులూరి రంగారావు, ఆకుల జానకి బాబు, షేక్ యాసిన్ బాబా, గురుబాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జయంతోత్సవ కమిటీ నిర్వాహకులు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

వలస కుటుంబాలకు నిత్యావసరాల అందజేత

రొంపిచర్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చయ్యపాలెంలో వలస కుటుంబాలకు నిత్యావసరాలను తహసీల్దార్ బండి నిర్మల శుక్రవారం అందజేశారు. వలసవచ్చిన నాలుగు కుటుంబాలు తుఫాన్ కారణంగా ఇబ్బందులు పడటంతో రూ.12వేల విలువైన నిత్యవసరాలను అందజేశారు. కార్యక్రమంలో మందలపు వెంక టరావు, ఘంటా హనుమ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

వరి పైర్లను పరిశీలించిన వ్యవసాయాధికారులు

వినుకొండ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలం ఉమ్మడివరం గ్రామంలో తుఫాను వల్ల గుండ్లకమ్మ పొంగి దెబ్బతిన్న వరిపొలాలను ఏవో జి.వరలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆనంద్, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మడి కళా పీఠం నియోజకవర్గం కమిటీ సమావేశం

వినుకొండటౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని పార్కులో గుమ్మడి కళా పీఠం నియోజకవర్గం కమిటీ సభ్యుల సమావేశం శుక్రవారం జరిగింది ఈ సందర్భంగా కళాపీఠం ప్రధాన కార్యదర్శి దేవరపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కళాకారులను ఏకం చేసి జనవరిలో చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వ పెద్దలకు రాష్ట్రంలోని కళాకారుల సమస్యలను వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వర్లు, భీమవరపు ఏడుకొండలు, నిడమనూరి వెంకట సుబ్బారావు, 5 మండలాల కార్యవర్గం పాల్గొన్నారు.

శ్రీ పోలేరమ్మతల్లి దేవాలయ పునఃనిర్మాణం

పట్టణ గ్రామదేవత శ్రీపోలేరమ్మతల్లి దేవాలయం పునర్నిర్మాణం చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. దే వాలయ పునర్నిర్మాణ కమిటీసభ్యులుశుక్రవారం సమావేశం నిర్వహించారు. నవంబరు 6నుండి 8వ తేదీవరకు తాత్కాలికంగా నిర్మిస్తున్న బాలాలయంలోకి దేవతామూర్తులను ప్రతిష్టించడం జరుగుతుంది.

టీడీపీ జెండాను తొలగించిన గుర్తుతెలియని వ్యక్తులు

పట్టణంలోని వెల్లటూరు రోడ్డు సమీపంలో టీడీపీ జెండాను గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి తొలగించడంపై ఆ పార్టీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయంపై సీఐ ప్రభాకర్‌ను వివరణ కోరగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతి

వినుకొండటౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద గుర్తుతెలియని మహిళ శుక్రవారం మృతిచెందింది. స్థానికుల సమాచారంతో పోలీసులు మృతదేహన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాల మార్చ్యూరీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

● నాదెండ్ల: మోటారు బైక్‌పై నుంచి కిందపడిన ఘటనలో గాయపడిన మహిళ చికిత్సపొందుతూ మృతిచెందింది. గణపవరం గ్రామానికి చెందిన చక్రవరం సాంబశివరాజు.. భార్య రమాదేవి(44) తుపాను రోజు బైక్‌పై నుంచి కిందపడడంతో.. చికిత్సకోసం జీజీహెచ్‌కి తరలించారు. కుమార్తె నాగపావని ఫిర్యాదుమేరకు నాదెండ్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

నందమూరి క్రిష్టర్‌కు బిషప్‌గా పదోన్నతి

చిలకలూరిపేట, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏసుక్రీస్తు దివ్య శాంతినిలయం అధినేత, పల్నాడు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు నందమూరి క్రిష్టర్‌కు బిషప్‌గా పదోన్నతి లభించింది. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాస్టర్స్ ఫెలోషిప్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ఆయనకు బిషప్‌గా పదోన్నతి కల్పించారు.

ఎస్ఎస్ఎన్ కళాశాలలో సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ జయంతి

నరసరావుపేట టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎన్ కళాశాలలో సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ జయంతి, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా విజిలెన్స్ వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎలక్యూషన్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు కళాశాల అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్త, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు కే రమేశ్వరరావు, జీఎం ఎన్ఏ మస్తాన్‌రావు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాస సాయి, ఎం అనిల్‌కుమార్, డాక్టర్ ఏ సరళాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ ఎన్ఈసీలో..

జేఎన్‌టీయూ నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో సర్దార్ వల్లభ్ బాయ్ పటేల్ 150వ జయంతి నిర్వహించారు. జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా 2కే నడక, వార్ ఫర్ భారత్ కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎస్ కిషోర్‌బాబు, ప్రొఫెసర్ కే శోభన్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పీ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో...



ర్యాలీ నిర్వహిస్తున్న ఈశ్వర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో వల్లభ్‌బాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు, చైర్మన్ షేక్ మీరావలి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, ఎండీ షేక్ మస్తాన్‌షరీఫ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ హెచ్ గంగాధర్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీఎం ఫార్మసీలో...


ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ప్రసాదరావు

ఎంపీఎం ఫార్మసీ కళాశాలలో వల్లభ్‌బాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ప్రసాదరావు, చైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డాక్టర్ ఎస్ రాజిని, డాక్టర్ కే నాగలక్ష్మి, శాలెం రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు చేయూత


శివశక్తి ఫౌండేషన్ ద్వారా వరద బాధితులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేస్తున్న జీవీ


చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

వినుకొండటౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా పునరావాసకేంద్రాలకు చేరిన వరద బాధితులకు ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.వెయ్యితోపాటు నిత్యావసరాలు పంపిణీ చేస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. బ్రాహ్మణపల్లి పంచాయతీలోని అరుంధతీకాలనీ, చెక్కవాగులో నివాసం ఉంటున్న ఎస్టీ మహిళలకు శివశక్తి ఫౌండేషన్ ద్వారా సుమారు 200మందికి దుప్పట్లు, చీరలు, నిత్యావసరాలు, ప్రభుత్వసాయాన్ని పంపిణీచేశారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వినుకొండ ప్రాంతంలోని పేదలకు శివశక్తి ఫౌండేషన్ ద్వారా దుప్పట్లు పంపిణీ చేస్తామని, పిల్లల చదువులకు ఆర్థికసాయాన్ని ఫౌండేషన్ ద్వారా అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, సీఐ ప్రభాకర్, ఆర్ఐ శ్రీహరి, నియోజకవర్గ పరిశీలకులు మానుకొండ శివప్రసాద్, టీడీపీ నాయకులు కర్నాటి వెంకటరెడ్డి, బొంకూరి రోశయ్య, మాదినేని ఆంజనేయులు, డీసీ కొండలు, మక్కెన కొండలు, కౌన్సిలర్ షకీలా, జానీ పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి

సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ జయంతి సందర్భంగా వినుకొండలోని చీఫ్ విప్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆయన పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఐక్యతకు పునాది వేసిన మహనీయుడు పటేల్ అన్నారు. కార్యక్రమంలో జీడీసీసీబీ చైర్మన్ మక్కన మల్లికార్జునరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ

వినుకొండ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ చీఫ్‌విప్ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ ప్రజాదర్బార్‌లో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. పలు మండలాల నుండి ప్రజలు వచ్చి తమ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సీఎంఆర్ఎఫ్ పేదలపాలిట పెన్నిధని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ అన్నారు. నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా 40మందికి రూ.26లక్షలు 73వేల చెక్కులను శుక్రవారం తన కార్యాలయంలో జీవీ పంపిణీచేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఎన్‌డీఏ ప్రభుత్వం

నూజెండ్ల: మొంథా తుఫాన్ బాధితులకు కొండంత అండగా ఎన్‌డీఏ ప్రభుత్వం ఉండి సహాయ సహకారాలు అందజేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని పాత ఉప్పలపాడు సచివాలయంలోని పునరావాస కేంద్రంలో ఆశ్రయ పొందుతున్న 53మందికి శుక్రవారం బియ్యం, కూరగాయలు, దుస్తులు, నగదును అందజేశారు. జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు నిశ్శంకర శ్రీనివాసరావు, నాగ శ్రీను రాయల్, మండల టీడీపీ అధ్యక్షుడు గంగినేని రాధాకృష్ణమూర్తి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

భూములిచ్చి ఏళ్లు గడుస్తున్నా పరిహారం దక్కలేదు

● గ్రీవెన్స్‌లో రైతుల మొర


సుగాలి కాలనీలో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): 167ఏ జాతీయ రహదారి విస్తరణకు భూములు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చిన వారికి పరిహారం ఇవ్వకపోతే వ్యవస్థలపై ప్రజలలో అపనమ్మకం ఏర్పడుతున్నదని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుంచి ఆయన తన క్యాంపు కార్యాలయంలో అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా బొప్పూడి, పసుమర్రు తదితర గ్రామాల రైతు లు ప్రత్తిపాటికి తమ సమస్యను వివరించారు. న్యాయంగా రావాల్సిన పరిహారం కోసం ఆందోళనలు, ధర్నాలు చేస్తున్నా అధికారులు స్పందించడం లేదని వాపోయారు. రైతుల సమస్య విన్న ప్రత్తిపాటి నేరుగా జేసీతో మాట్లాడారు. వెంటనే సమస్యపై దృష్టి పెట్టాలన్నారు. అలాగే ఎండుగుంపాలెం ఎస్సీ కాలనీ వాసులు శ్మశానవాటిక భూమి సమస్యను జేసీకి తెలిపారు. జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని పాల్గొన్నారు.

రూ. 25 కోట్లతో వాగుల అభివృద్ధి

వరదనీటి సమస్యను వచ్చే వర్షాకాలం నాటికి పరిష్కరిస్తామని 167ఏ బైపాస్, ఎన్‌హెచ్16 అధికారులు హామీ ఇచ్చారని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి శుక్రవారం తెలిపారు. పట్టణంలోని సుగాలీ కాలనీలో 48మంది తుఫాన్ బాధితులకు నగదు, నిత్యావసరాలు ఆయన అందించారు. ఓగేరు, కుప్పగంజి వాగు ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చేపట్టే రూ.20 నుంచి రూ.25కోట్ల విలువైన పనులకు డిసెంబరులో టెండర్లు పిలుస్తామని ఎన్.హెచ్ పీడీ చెప్పారని ప్రత్తిపాటి తెలిపారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ పి.శ్రీహరిబాబు, టీడీపీ నాయకులు పఠాన్ సమాద్ ఖాన్, మద్దుమాల రవి, పిల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విలీన గ్రామాల్లో అభివృద్ధి శూన్యం

● సమావేశంలో కౌన్సిలర్ల ఆవేదన


సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్మన్ రఫాని, పాల్గొన్న కౌన్సిలర్లు

చిలకలూరిపేట, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో మూడు గ్రామాల విలీనం వ్యవహారం శుక్రవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చింది. టీడీపీ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, కౌన్సిలర్ జాలాది సుబ్బారావు విలీనమైన గణపవరం, పసుమర్రు, మనుకొండవారిపాలెంలో కనీస అభివృద్ధి జగరలేదన్నారు. మనుకొండవారిపాలెం మున్సిపాలిటీలోనే ఉంటేనే బాగుంటుందని వైసీపీ కౌన్సిలర్ మానుకొండ మాధవి పేర్కొన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్మన్ షేక్ రఫాని మాట్లాడుతూ విలీన గ్రామాలపై ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కలిసి కౌన్సిల్ సభ్యులంతా వినతిపత్రం అందించాలన్నారు. మొబైల్ ఈ-పాస్ యంత్రాలకు రూ.1.18 లక్షలు సకాలంలో చెల్లించకపోవడం అపరాధ రుసుముతో కలిపి రూ.2.97 లక్షలు చెల్లించిన వ్యవహారాన్ని టీడీపీ కౌన్సిలర్ పాములపాటి శివకుమారి తప్పుపట్టారు. విలీన గ్రామాల్లో పన్నులు వసూలు చేసుకోలేకపోతున్నామని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు సమావేశంలో వివరణ ఇచ్చారు. దీని వలన భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఉన్నాయని, ఆర్థిక సంఘం నిధులు కూడా నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. కౌన్సిలర్లు బేరింగ్ మౌలాలి, వలేటి వెంకటేశ్వరరావు ఆయా అంశాలపై జరిగిన చర్చలలో పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఏపీ ఎన్జీవో ఎన్నికలు

చిలకలూరిపేట, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట తాలూకా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షునిగా బి.హనుమంతు నాయక్ ప్యానల్ శుక్రవారం ఎన్నికైంది. పెన్షనర్ల హోమ్ లో ఎన్నికల అధికారి కె.నాగేశ్వరరావు పర్యవేక్షణలో 16 మంది సభ్యులతో కూడిన అసోసియేషన్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.హనుమంతు నాయక్, కార్యదర్శిగా జి.వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ఎ.నరేంద్ర, సహాధ్యక్షులుగా డాక్టర్.ఎల్.ప్రసాద్ నాయక్, ఉపాధ్యక్షులుగా కె.శ్రీధర్ రెడ్డి, డి.మురహరిరావు, పి.వి.సుధాకర్, సి. హెచ్.కృష్ణ, ఉపాధ్యక్షులు మహిళా ఎ . లక్ష్మి లావణ్య, సహాయ కార్యదర్శులుగా బి.నాగార్జున, టి.శ్రీనివాసరావు, డి.సాంబశివరావు,ఆర్. బుజ్జి బాయి, మహిళా కార్యదర్శిగా వై. మేరీ కుమారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ గా బి.వి.మారుతిలక్ష్మి ను, జిల్లా ఈసీ మెంబర్‌గా బి.వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి శ్యాంసుందర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

వినుకొండ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వినుకొండ మునిసిపల్ ఆఫీస్ ఎదురు ఏఐటీయూసీ పతాకాన్ని సీనియర్ నాయకులు రాయబారం వందనం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కొండ్రముట్ల సుభాని, రాచపూడి ఏసుపాదం, సంపెంగుల అబ్రహం రాజు, పచ్చిగొర్ల ఏసు, కంచర్ల కోటేశ్వరరావు, బాబురావు, కొప్పరపు మల్లిఖార్జున, పిన్నబోయిన వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక కేబీ రోడ్డులో ఘనంగా నిర్వహించారు. ఏఐటియుసీ ఏరియా కార్యదర్శి పేలూరి రామారావు మాట్లాడుతూ.. దేశంలో కార్మికులకు 8 గంటల పని విధానం, ఉద్యోగ భద్రత ఏఐటీయూసీ పోరాటం వలన వచ్చిందన్నారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

శావల్యాపురం, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలపై కూటమి ప్రభుత్వం చేపట్టిన పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ మండల కన్వీనర్ బోడెపూడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కొత్తలూరు, పోట్లూరు, ఇర్లపాడు, వయ్యకల్లు, కారుమంచి గ్రామాల్లో వైసీపీ నాయకులు శుక్రవారం కోటి సంతకాల కార్యక్రమాన్ని చేపట్టారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 10 మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేసేందుకు జీవో విడుదల చేయడం దుర్మార్గమన్నారు. బోడెపూడి శ్రీను, కావూరి మాబులు, బొల్లా సుబ్బారావు, బొల్లా శివ, అబ్బూరి అయ్యన్న, సైదా, మోషె పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లించాలి

నరసరావుపేట రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో పంటలు దెబ్బతిన్న రైతులందరికీ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందజేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పొలంబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని పమిడిమర్రు గ్రామంలో దెబ్బతిన్న పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. మిర్చి రైతు ఎకరాకు రూ.60 వేల ఖర్చు చేశారని, పంట మొత్తం పాడైపోయి కన్నీళ్లే మిగిలాయన్నారు. వారికి న్యాయం జరిగే వరకు వైసీపీ రైతుల పక్షాన పోరాడుతుందన్నారు.

వైద్యశాలల ప్రైవేటీకరణ నిలిపివేయాలి

ప్రభుత్వ వైద్యశాలల ప్రైవేటీకరణ తక్షణమే అపేయాలని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. కోటిసంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం చిన తురకపాలెంలో ఆయన నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల నుంచి చేపట్టిన కోటిసంతకాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలిపారు.


పమిడిమర్రులో మిరప తోటలను పరిశీలిస్తున్న గోపిరెడ్డి

వైభవంగా ప్రతిష్ఠా మహోత్సవాలు

నూజెండ్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త జెడ్డావారిపాలెంలో రూ.70లక్షలతో పునర్నిర్మించిన దేవాలయంలో పోలేరమ్మ తల్లి, పోతురాజు, వినాయక విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. రాష్ట్ర వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ పారా వెంకటలక్ష్మయ్య, డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ముండ్రు సుబ్బారావు, సర్పంచ్ గోగులపాటి పున్నారావు, బొల్లా ఆదిలక్ష్మి, మండల కన్వీనర్ ముప్పరాజు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముక్కెళ్లపాడులో సహాయక చర్యలు

మండలంలోని ముక్కెళ్ళపాడులో తుఫాన్ ప్రభావంతో స్థానిక పాఠశాలలోని పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న 25మంది బాధిత కుటుంబాలకు శుక్రవారం సర్పంచ్ సింగంశెట్టి వెంకటబాలప్రసాదు నిత్యవసరాలు, నగదును అందజేశారు. జడ్పీటీసీ చంద్ర రామకృష్ణ, సింగంశెట్టి శ్రీను, శివాజీ కృష్ణమూర్తి, రామయ్య, యల్లయ్య, రామాంజనేయులు, మునెయ్య, మనోహర్, వీఆర్వో జ్యోతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పటేల్‌కు ఘన నివాళి

శావల్యాపురం: సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ జయంతిని శావల్యాపురంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పటేల్ చిత్ర పటానికి ఎంపీడీవో పేరు మీన సీతారామయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సమగ్రత ప్రతిజ్ఞ చేశారు. చుండూరి వెంకటేశ్వర్లు, చిన్న కంచెర్ల సర్పంచ్ పూరేటి నాగేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావు, పరిపాలనాధికారి పద్మజరాణి, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో యాకోబు పాల్గొన్నారు.


బీజేపీ ఆధ్వర్యంలో...

చిలకలూరిపేట: బీజేపీ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, నెల్లూరి ఈశ్వర్ రంజిత్, వరికూటి నాగేశ్వరరావు, గట్టా హేమకుమార్, పోలయ్య పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పటేల్ చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గ్రామాల్లో సూపర్ శానిటేషన్

శావల్యాపురం: గ్రామాల్లో పారిశుద్యాన్ని మెరుగుపరచేందుకు సూపర్ శానిటేషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో బొడ్డు యాకోబు అన్నారు. శావల్యాపురంలో రోడ్ల వెంబడి బ్లీచింగ్ చల్లే కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. 15 గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

వాలీబాల్ రాష్ట్ర జట్టుకి యడ్లపాడు మండల విద్యార్థి


బోరుగడ్డ సుమంత్

యడ్లపాడు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): వాలీబాల్ రాష్ట్ర జట్టులో మండలానికి చెందిన విద్యార్థికి చోటుదక్కింది. మండలంలోని లింగారావుపాలెం జడ్పీ హైస్కూలుకు చెందిన పదో తరగతి విద్యార్థి బోరుగడ్డ సుమన్ అండర్-17 బాలుర రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యాడు. శుక్రవారం నంబూరు జడ్పీ హైస్కూలులో జరిగిన ఎంపికలలో సుమంత్ అత్యుత్తమ ప్రతిభను చూపి రాష్ట్రజట్టులో స్థానం దక్కించుకున్నాడు. త్వరలో పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరులో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో రాష్ట్ర జట్టు తరఫున ఆడనున్నాడు. సుమంత్‌ను హెచ్ఎం కె.వెంకటరామిరెడ్డి, పీఈటీ మేరి శౌరిలు, ఎస్ఎంసీ చైర్మన్ షేక్ జాన్‌సైదులు, సర్పంచ్ కరిముణ్, ఎంపీటీసీ వీరరాఘవయ్య, గ్రామపెద్దలు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నరసరావుపేట రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట-సత్తెనపల్లి ప్రధానరహదారిపై మోటార్ సైకిల్‌ను లారీ ఢీకొన్న సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. ప్రమాదంలో నరసరావుపేట పట్టణానికి చెందిన నిషా(28) అక్కడికక్కడే మృతి చెందగా, మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న మరో మహిళ మల్లిక తీవ్రంగా గాయపడింది. నరసరావుపేట పట్టణానికి చెందిన డాన్సర్లు ఇరువురు సత్తెనపల్లి వైపు నుండి నరసరావుపేట వస్తుండగా నరసరావుపేట మండలం ములకలూరు వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. సమాచారం తెలుసుకున్న నరసరావుపేట రూరల్ ఎస్సైలు కిషోర్, ఫాతిమా తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.


యనాదులతో కలిసి కలెక్టరేట్ వద్ద ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు తదితరులు

యానాదుల కుటుంబాలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలి

● కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కోటప్పకొండ వద్ద నివాసగృహాలు లేక ఇబ్బందులు పడుతున్న 150మంది కుటుంబాలకు ఇళ్ళస్థలాలు ఇవ్వాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం యానాదులతో కలిసి కలెక్టర్ కృతికా శుక్లాకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోటప్పకొండ వద్ద యానాదలు 30 సంవత్సరాల నుంచి ప్రభుత్వస్థలంలో గుడిసెలలో జీవిస్తున్నారన్నారు. తుపాన్ కారణంగా నిరాశ్రయులయ్యారని చెప్పారు. కార్యక్రమంలో కోటప్పకొండ టీడీపీ ఇన్‌చార్జి టి.వీరప్పయ్య పాల్గొన్నారు.


క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్న పోలీసు అధికారులు

పోలీసు ప్రధాన కార్యాలయంలో క్యాండిల్ ర్యాలీ

నరసరావుపేట లీగల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల స్మారక దినోత్సవంలో భాగంగా శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీసులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ బీకృష్ణరావు ఆధ్వర్యంలో లింగంగుంటలోని ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల వరకు ర్యాలీ చేశారు. దేశ భద్రత, సమాజ రక్షణ కోసం అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని కొనియాడారు. ఏఆర్ డీఎస్పీ మహాత్మా గాంధీరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత పోలీస్ సిబ్బందికి ఘన సన్మానం

నరసరావుపేట లీగల్, అక్టోబరు 31, (ఆంధ్రజ్యోతి): పదవి విరమణ పొందిన సీఐ అల్లూరి జగన్నాథ్ సింగ్, ఖాసీంలను శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. వారిని ఎస్పీ కృష్ణారావు పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. శేష జీవితం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని కాంక్షించారు. క్రైమ్ అదనపు ఎస్పీ లక్ష్మీపతి, మహాత్మా గాంధీ రెడ్డి, టి.మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

రెండో పట్టణ సీఐగా సీహెచ్ ప్రభాకర్

నర్సరావుపేట లీగల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట రెండవ పట్టణ సీఐగా చలంచర్ల ప్రభాకర్ రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సీఐ హైమారావును వీఆర్‌కు బదిలీచేశారు. ప్రభాకర్‌రావు గతంలో మొదటి పట్టణ సీఐగా సేవలందించారు.

కోతకు గురైన కల్వర్టు పరిశీలన

నూజెండ్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దాట్లవారిపాలెం సమీపంలో మొంథా తుఫాన్ ప్రభావంతో జౌకు వాగు బ్రిడ్జి వద్ద కోతకు గురైన రోడ్డును వినుకొండ మార్కెట్ యార్డు చైర్మన్ మీసాల మురళీ కృష్ణ యాదవ్ శుక్రవారం పరిశీలించారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సహకారంతో పొలాలకు వెళ్ళే బాటలను పునరుద్ధరిస్తామన్నారు. విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం డైరెక్టర్ ఎం.వీరాచారి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. భారీ నష్టం

రొంపిచర్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు మిరప, వరి పంటలు దెబ్బతిన్నాయి. వర్షం లేకపోవడంతో పొలాల్లో నీటిని రైతులు బయటకు పంపుతున్నారు. రొంపిచర్ల, కొనకంచివారిపాలెం, అలవాల, అచ్చయ్యపాలెం, వీరవట్నం, మాచవరం, గార్లపాడు, పరగటిచర్ల గ్రామాల్లో ప్రధానంగా మిర్చి పంటను రైతులు సాగు చేస్తున్నారు. చాకలికుంట తండా, విప్పర్ల, రెడ్డిపాలెం, కొత్తపల్లి గ్రామాల్లో వరి పాడైపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వైసీపీవి డైవర్షన్ రాజకీయాలు.. ఫేక్ ప్రచారాలు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విపత్తుల సమయంలో కూటమి ప్రభుత్వం పనిచేయడాన్ని జీర్ణించుకోలేక వైసీపీ డైవర్షన్ రాజకీయాలు, ఫేక్ ప్రచారాలకు పాల్పడుతుందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. తుఫాన్ వల్ల రైతులు నష్టపోయి అల్లాడుతుంటే సాయం చేయాల్సిందిపోయి అబద్ధపు ప్రచారాలు చేయడం జగన్‌రెడ్డి బ్యాచ్‌కే సాధ్యమన్నారు. రైతు సంక్షేమం గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదన్నారు. రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు వరి రైతులకు కనీస మద్దతు ధర లభించలేదన్నారు. జగన్ తొలి మూడేళ్ళలో డ్రిప్ సబ్సిడీని పూర్తిగా నిలిపివేశారన్నారు.

హరేరామ హరేకృష్ణ నామ ఏకాహ్నిక దీక్ష


ఏకాహ్నిక దీక్షలో పాల్గొన్న నాగసరపు సుబ్బరాయగుప్త, అనురాధ దంపతులు, భక్తులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని పట్టాభిరామ స్వామి దేవస్థానంలో హరేరామ హరేకృష్ణ నామ ఏకాహ్నిక దీక్ష 29వ వార్షిక మహోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. స్వామివారికి విశ్వక్సేనపూజ, మండపారాధన, అఖండ దీపోత్సవం, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త, అనురాధ దంపతులచే వైభవంగా నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారికి లక్షనామ సహిత తులసీదళార్చన జరుగుతుంది. సాయంత్రం 7గంటలకు వరకు ఉత్సవమూర్తులకు సేవ జరుగుతుందని పూజారి వేదాంత రాంబాబు చెప్పారు.

రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌కు ఎన్ఈసీ విద్యార్థిని

నరసరావుపేట కల్చరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ సార్జెంట్ డి.కావ్యశ్రీ రాష్ట్రస్థాయి స్టార్టప్, ఇన్నోవేషన్ వర్క్‌షాప్‌కు ఎంపికైనట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థిని కంప్యూటర్స్ సైన్స్ ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతోంది. సోల్జియర్ హెల్త్ రిస్ట్ బ్యాండ్ ప్రాజెక్టుతో బెటాలియన్, గ్రూపు స్థాయి సెలక్షన్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. నవంబర్ 2, 3 తేదీల్లో నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో జరిగే ఈ కార్యక్రమంలో కావ్యశ్రీ పాల్గొంటుందని చెప్పారు. కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డాకర్ డి.సునీల్, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్ బాబు, సీఎస్ఈ విభాగాధిపతి డా.ఎస్.తిరుమలరావు అభినందించారు.


కావ్యశ్రీని అభినందిస్తున్న వైస్ ప్రిన్సిపాల్, విభాగాధిపతులు